


ట్రిబుల్ ఐటీ

- రాజకీయ నేతలకు ఆర్థిక వనరుగా ఇడుపులపాయ
- కూటమి ప్రభుత్వం వచ్చి ఎనిమిది నెలలు దాటినా.. ఇంకా వైసీపీ ఫ్లేవర్
- ఇప్పుడు కూడా అక్కడ ఉద్యోగాలు, వ్యాపారాలు వైసీపీ బ్యాచ్‌దే
- చక్రం తిప్పుతున్న ఓ అధికారి.. ఓ నేత

(కడప-ఆంధ్రజ్యోతి): జగన్ హయాంలోని ఐదేళ్ల పరిపాలన అదొక పీడకల లాంటిది అంటారు. అంతగా రాజ్యాంగాన్ని, నిబంధనలను ఉల్లంఘించి మాదే ప్రభుత్వం, మేం చెప్పిందే వేదం అన్నట్లుగా బరితెగించారంటారు. ఆ ఐదేళ్లలో యోగివేమన యూనివర్శిటీ, వైఎస్సార్ హార్టికల్చర్, కడప జనరల్ ఆసుపత్రి (రిమ్స్).. ఇలా అన్ని చోట్లా అడ్డగోలుగా వైసీపీ సానుభూతిపరులకు ఉద్యోగాలు ఇచ్చారు. ట్రిపుల్ ఐటీలో అప్పట్లో అధికారులు కూడా పులివెందులతో పాటు ఇతర వైసీపీ నేతల నుంచి సిఫారసు లెటరు వస్తే చాలు అడ్డగోలుగా వ్యవహరించి ఉద్యోగాలు ఇచ్చారు. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు టీడీపీ కూడా దీనిపై భారీ పోరాటం చేసింది. ఇప్పుడు కూటమి ప్రభుత్వం వచ్చి ఎనిమిది నెలలు దాటినా.. సేమ్ టు సేమ్ వైసీపీ మార్కు ఫ్లేవరే కొనసాగుతోంది. వైసీపీ హయాంలో చక్రం తిప్పిన వారే ఇప్పుడు తమ హవాను కొనసాగిస్తున్నారు. ముఖ్యంగా ఇడుపులపాయలోని ట్రిపుల్ ఐటీలో ఇంకా వైసీపీ వాసనలే ఉండడం గమనార్హం. ఎమ్మెల్సీ రామగోపాల్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్సీ, పులివెందుల టీడీపీ ఇన్‌చార్జి బీటెక్ రవికి మధ్య ఉన్న విభేదాల కారణంగానే ఇడుపులపాయలో వైసీపీ బ్యాచ్ తన హవా కొనసాగిస్తోందనే చర్చ నడుస్తోంది.

ఇష్టారాజ్యంగా ఉద్యోగాలు

ట్రిపుల్ ఐటీలో ఇటీవల కొందరికి ఉద్యోగావకాశాలు కల్పించారు. ఇక్కడున్న ఖాళీలను భర్తీ చేయడాన్ని ఎవరూ తప్పుబట్టడం లేదు. అయితే వీటిని వైసీపీ, టీడీపీ నేతలు కూడబలుక్కుని జాబితా పంపడం చర్చనీయాంశమైంది. వైసీపీలో కీరోల్‌గా ఉన్న వ్యక్తి ఇప్పుడు ఇడుపులపాయలో కీలకమైన పొజిషన్‌లో ఉన్నారు. అతను ఏం చెప్పినా పై స్థాయిలో ఓ అధికారి జీ హుజూర్ అంటారంటారు. ఇక ట్రిపుల్ ఐటీలో క్యాంటీన్లపై నేతల మధ్య వార్ జరిగింది. అక్కడ క్యాంటీన్లు మూసివేశారు. విద్యార్థులు పక్కనున్న రెస్టారెంటు నుంచి ఫుడ్ తెప్పించుకోవడం మొదలుపెట్టారు. ఈ విషయం తెలిసి ఓ నేత బయట ఫుడ్ నిర్వాహకులతో మాట్లాడుకుని అదనపు ధరలతో విక్రయిస్తున్నట్లు చెబుతున్నారు. కాగా.. రెస్టారెంట్ నుంచి తెప్పించుకుని తినడంతో కొందరు విద్యార్థులు ఇటీవల అస్వస్థతకు గురయ్యారు. వారు ఆందోళనకూ దిగారు. దీంతో ట్రిపుల్ ఐటీలో క్యాంటీన్లు మూతపడ్డ విషయం వెలుగులోకి వచ్చింది. దీనిపై ఇరువర్గాలు తర్జనభర్జన పడి చివరకు ఇటవీల క్యాంటీన్లను ప్రారంభించారు.



ఇడుపులపాయలోని ట్రిపుల్ ఐటీ భావిభారతానికి అద్భుతమైన జీవశక్తిని తయారు చేసే శిక్షణ కేంద్రం. ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతూ మంచి మార్కులు సాధించుకున్న విద్యార్థులకు ట్రిపుల్ ఐటీ ఒక స్వర్గధామం. ఇక్కడ సీటు దొరికి టాలెంట్ ఉంటే చదువు ముగిసేలోపు జాబ్‌తో బయటికి వెళ్లవచ్చు. అలాంటి ఎంతోమంది పేద విద్యార్థులు ఏడాదికి లక్షలాది రూపాయల జీతంతో ప్రముఖ కంపెనీలలో ఉద్యోగాలు పొందారు. సరస్వతీ కటాక్షంతో లక్ష్మీ కటాక్షంవైపు నడిపించే ట్రిపుల్ ఐటీలో పరిస్థితులు ఇప్పుడు మారిపోయాయి. జగన్ సర్కారు హయాం నుంచి ఇప్పటి వరకు ట్రిపుల్ ఐటీ రాజకీయ నాయకులకు, అధికారులకు అక్షయపాత్రగా మారిపోయింది.

ట్రిపుల్ ఐటీలో క్యాంటీన్ల ఏర్పాటు మొదలు ఉద్యోగాల నియామకం వరకూ.. అంతా రాజకీయమే నడుస్తుండటంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. విద్యాలయంలో రాజకీయాలేంటని పలువురు ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికైనా దీనిపై ఉన్నతాధికారులు దృష్టిసారించాలని విద్యార్థులు సైతం కోరుతున్నారు.



కబ్జాకు గురైన కొండకు సంబంధించిన రెవెన్యూ మ్యాప్‌ను పరిశీలిస్తున్న ఆర్డీవో చంద్రమోహన్

కొండను ఆక్రమించిన వారిపై చర్యలు

- ఆర్డీవో చంద్రమోహన్

బి.కోడూరు, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): బి.కోడూరు మండలం మున్నెల్లి రెవెన్యూ పొలంలో కొండను ఆక్రమించి చదును చేసి కంచెలు వేసిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని బద్వేలు రెవెన్యూ డివిజనల్ ఆఫీసరు చంద్రమోహన్ తెలిపారు. బుధవారం ఆంధ్రజ్యోతిలో 'కొండలు కబ్జా' అనే శీర్షికన కథనం వెలువడింది. దీనిపై జిల్లా ఉన్నతాధికారులు స్పందించారు. అందులో భాగంగా ఆర్డీవో సంఘటన స్థలానికి వచ్చి పరిశీలించారు. మండల అధికారులతో సర్వే మ్యాప్ తెప్పించుకుని చూశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మున్నెల్లి రెవెన్యూ పొలం సర్వే నెం.2735లో దాదాపు 151 ఎకరం కొండదడి ఉందని, దానికి ఆనుకుని సర్వే నెం.2767లో 9 ఎకరాల 89 సెంట్లు ఒకతను కొనుగోలు చేశాడన్నారు. దానితో పాటు కొండను చదును చేసి ఆక్రమించి కంచె వేశారని, అందులో ఉన్న చెక్‌డ్యాంను కూడా పూడ్చివేసి పొలం తయారు చేశారన్నారు. అతనిపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. ఆక్రమించిన స్థలంలో హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేస్తామన్నారు. ఆయన వెంట డిప్యూటీ తహశీల్దారు చంద్రలీల, మండల సర్వేయరు రక్షిత, స్థానిక వీఆర్వో రాజు, ప్రవీణ్‌కుమార్, సచివాలయ సర్వేయరు గురయ్య పాల్గొన్నారు.

జడ్పీ హైస్కూలును తనఖా పెట్టిన వారిపై కేసు నమోదు

బి.కోడూరు, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): గోవిందాయపల్లె జిల్లా పరిషత్ హైస్కూలు ఆన్‌లైన్ చేయించుకుని డీసీసీబీలో తనఖా పెట్టిన వారిపై ఎట్టకేలకు కేసు నమోదైంది. గత ఏడాది జూలై 16వ తేదీన 'జడ్పీ హైస్కూలు తనఖా' అనే శీర్షికన ఆంధ్రజ్యోతిలో కథనం వెలువడింది. అప్పట్లో దీనికి సంబంధించిన డిప్యూటీ తహశీల్దారు, ఒక వీఆర్వో, సచివాలయ సర్వేయరును ప్రభుత్వం సస్పెండ్ చేసింది. అప్పటి నుంచి ఆన్‌లైన్‌లో కొండా వెంకటసుబ్బమ్మ పేరు అలాగే ఉంది. మంగళవారం కడపలో జరిగిన డీఆర్‌సీ సమావేశానికి హాజరైన జిల్లా ఇన్‌చార్జి మంత్రి ఎస్.సవిత దృష్టికి ఈ విషయం వెళ్లింది. దీనిపై కలెక్టర్ శ్రీధర్ వెంటనే రెవెన్యూ యంత్రాంగాన్ని అప్రమత్తం చేయడంతో మంగళవారం రాత్రి 10గంటల సమయంలో బి.కోడూరు మండల తహశీల్దారు మధునాయక్ పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. దీంతో జడ్పీ హైస్కూలును డీసీసీ బ్యాంకులో తనఖా పెట్టి రూ.8 లక్షల రుణం పొందిన కొండా వెంకటసుబ్బమ్మ, ఆమె భర్త వెంకటసుబ్బారెడ్డిపై బి.కోడూరు ఎస్ఐ రాజు కేసు నమోదు చేశారు.

అప్పట్లో మున్నెల్లి రెవెన్యూ పొలంలో సర్వేనెంబరు 755లో 4.27 ఎకరాలు రిజిస్టరు పొలాన్ని అదే గ్రామానికి చెందిన ముచ్చర్ల క్రిష్ణయ్య గోవిందాయపల్లె జిల్లా పరిషత్ హైస్కూలుకు ఇచ్చారు. ఆ పొలాన్ని కొండా వెంకటసుబ్బమ్మ, ఆమె భర్త వెంకటసుబ్బారెడ్డి డీసీసీ బ్యాంకులో తనఖా పెట్టి రుణాన్ని పొందారు. ఈ విషయంపై బుధవారం బి.కోడూరు తహశీల్దారు కార్యాలయానికి వచ్చిన ఆర్డీవో చంద్రమోహన్‌ను వివరణ కోరగా.. పాఠశాల పొలాన్ని ఆన్‌లైన్ చేసిన డీటీ, వీఆర్వో, సచివాలయ సర్వేయరును ఇప్పటికే సస్పెండ్ చేశామన్నారు. తనఖా పెట్టిన వారిపై కూడా కేసు నమోదు చేయించామని వారి పేరుతో ఆన్‌లైన్ చేసేందుకు సహకరించిన వారిపై కూడా చర్యలు తీసుకుంటున్నామని అన్నారు. అలాగే డీసీసీ బ్యాంకులో రుణం ఇచ్చినవారిపై కూడా చర్యలు తీసుకుంటామని ఆర్డీవో తెలిపారు.



గత ఏడాది జూలై 17న ఆంధ్రజ్యోతిలో జడ్పీ హైస్కూలు తనఖాపై ప్రచురితమైన కథనం

అశ్వవాహనంపై కోనేటి రాయుడు





సర్వభూపాల వాహనం

కడప కల్చరల్, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): దేవునికడప లక్ష్మీవేంకటేశ్వరస్వామి దేవస్థానం వార్షిక బ్రహ్మోత్సవాలలో భాగంగా బుధవారం రాత్రి 8 గంటలకు కోనేటి రాయుడు అశ్వవాహనంపై ఊరేగుతూ భక్తులకు దర్శనమిచ్చారు. కోటి దివ్వెల కాంతుల తేజోమూర్తిగా ప్రకాశిస్తున్న తిరుమలేసుడు కల్కి అవతారంలో అశ్వవాహనంపై కొలువుదీరారు. ఊరేగింపు కార్యక్రమానికి ముందుగా ఆలయ ప్రధాన అర్చకులు కృష్ణమూర్తి, త్రివిక్రమ్, సాయి, తరుణ్, కృష్ణమోహన్‌లు స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అంతకు ముందు ఉదయం 9గంటలకు సర్వాంతర్యామి సర్వభూపాల వాహనంపై మాడవీధులలో ఊరేగారు. తదుపరి 10-30 గంటలకు స్నపన తిరుమంజనం గావించారు. సాయంత్రం 6 గంటలకు స్వామివారికి ఊంజల్‌సేవ అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. అనంతరం తిరుమల తిరుపతి దేవస్థానం అన్నమాచార్య ప్రాజెక్ట్ వారిచే ఆలపించిన అన్నమాచార్య కీర్తనలు, హరికథ భక్తులకు వీనుల విందు చేశాయి. కార్యక్రమంలో ఆలయ ఇన్‌స్పెక్టర్ ఈశ్వర్ రెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.



స్వయం ఉపాధిని సద్వినియోగం చేసుకోండి

- రూ.80.15కోట్లతో 4998 యూనిట్లు
- కలెక్టర్ చెరుకూరి శ్రీధర్



మాట్లాడుతున్న కలెక్టర్ చెరుకూరి శ్రీధర్

కడప కలెక్టరేట్, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో వివిధ కార్పొరేషన్ల ద్వారా అందిస్తున్న స్వయం ఉపాధి అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ చెరుకూరి శ్రీధర్ పిలుపునిచ్చారు. బుధవారం కలెక్టరేట్‌లోని పీజీఆర్ఎస్ హాల్లో ఆయా కార్పొరేషన్ అధికారులతో సమీక్షించారు. కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో వివిధ కార్పొరేషన్ల ద్వారా మొత్తం 4,998 యూనిట్లకు రూ.80.15 కోట్లు లక్ష్యంగా స్వయం ఉపాధి అవకాశాలు కల్పిస్తామన్నారు. మహిళలకు 33 శాతం ప్రాధాన్యత ఉంటుందని, గతంలో లబ్ధిపొందిన వారు ఈ పథకాలకు అనర్హులన్నారు. వివిధ కార్పొరేషన్ల ద్వారా లబ్ధిదారులకు 30 నుంచి 50శాతం వరకు సబ్సిడీ ఉంటుందన్నారు. జిల్లాలో బీసీ కార్పొరేషన్ ద్వారా 1,550 యూనిట్లు, బీసీ జనరిక్ మందుల షాపులకు 32 యూనిట్లు, కార్పొరేషన్ ద్వారా 240 యూనిట్లు, ఈడబ్ల్యూఎస్ జనరిక్ మందుల షాపులకు 41 యూనిట్లు, కాపు చంద్రన్న స్వయం ఉపాధికి 379 యూనిట్లు, ఎస్సీ కార్పొరేషన్ ద్వారా 1,026 యూనిట్లు, మైనార్టీ కార్పొరేషన్ ద్వారా 1,723 యూనిట్లు, క్రిస్టియన్ మైనార్టీకి 7 యూనిట్లు కలిపి.. మొత్తం 4,998 యూనిట్లకు రూ.80.15 కోట్ల లక్ష్యంతో స్వయంఉపాధి అవకాశాలు కల్పిస్తామన్నారు. రూ.20.29 కోట్లతో 1,651 యూనిట్లతో మహిళలకు స్వయం ఉపాధి అవకాశాలు కల్పిస్తామన్నారు. ఎంపీడీఓలు స్వర్ణాంధ్ర విజన్‌లో భాగంగా రాబోయే ఐదేళ్లలో మండలాల అభివృద్ధిపై ప్రణాళికలు రూపొందించుకోవాలన్నారు. మండల, మున్సిపల్ కమిషనర్లు ఆయా గ్రామాల్లో సమస్యలను గుర్తించాలన్నారు. అర్జీదారులతో సెల్ఫీ దిగి సమస్యను నిశితంగా పరిశీలించాలన్నారు. స్వయం సహాయక బృందాలకు రూ.10 లక్షల నుంచి రూ.20 లక్షల రుణ సహాయం అందించాలని బ్యాంకర్లకు సూచించారు. కార్యక్రమంలో ఎస్సీ కార్పొరేషన్ ఈడీ డాక్టర్ హెచ్. వెంకటసుబ్బయ్య, బీసీ కార్పొరేషన్ ఈడీ జయసింహ, డ్వామా పీడీ ఆదిశేషారెడ్డి, డీఆర్‌డీఏ పీఈడీ ఆనంద్ నాయక్, మెప్మా పీడీ కిరణ్‌కుమార్, కార్పొరేషన్ కమిషనర్ మనోజ్‌కుమార్‌రెడ్డి, ఎల్డీఎం జనార్దన్ పాల్గొన్నారు.

మహా కుంభమేళాకు రెండు ప్రత్యేక రైళ్లు

కడప ఎర్రముక్కపల్లె, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): మహా కుంభమేళాకు ప్రయాణికుల రద్దీని పురస్కరించుకుని రెండు ప్రత్యేక రైళ్ల నడుపుతున్నట్లు కడప రైల్వే సీనియర్ కమర్షియల్ ఇన్‌స్పెక్టర్ జనార్దన్ తెలిపారు. తిరుపతి నుంచి ప్రత్యేక రైలు (07117) ఈనెల 14వ తేదీ శుక్రవారం రాత్రి 11:45 గంటలకు బయలుదేరి కోడూరుకు 12:54, రాజంపేట 1:18, కడప 2:03, ఎర్రగుంట్ల 2:33 గంటలకు చేరుకుంటుందన్నారు. ఆదివారం రాత్రి 11:50కి దనాపూర్ చేరుకుంటుందని తెలిపారు. అలాగే తిరుగు ప్రయాణంలో 17వ తేదీ సోమవారం మధ్యాహ్నం 3:15కు దనాపూర్‌లో రైలు(7118) బయలుదేరి బుధవారం ఉదయం 9:33కు కడప చేరుకుంటుందన్నారు. మధ్యాహ్నం 1:55కి తిరుపతికి చేరుకుంటుందని తెలిపారు. తిరుపతి నుంచి మరో ప్రత్యేక రైలు (07119) 18వ తేదీ మంగళవారం రాత్రి 11:45కు బయలుదేరి కోడూరు, రాజంపేట, కడప, ఎర్రగుంట్ల మీదుగా గురువారం రాత్రి 11:55గంటలకు దనాపూర్ చేరుకుంటుందన్నారు. తిరుగు ప్రయాణంలో ప్రత్యేక రైలు (07120) దనాపూర్‌లో 21వ తేదీ శుక్రవారం మధ్యాహ్నం 3:15కు బయలుదేరి ఆదివారం 9:43కు కడపకు చేరుకుని అదేరోజు మధ్యాహ్నం 1:45కు తిరుపతి చేరుకోనుంది.

కుంభమేళా ప్రయాణికులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

డీటీసీ వ్యవహారంపై విచారణ



శ్రీలక్ష్మి, పీడీ, ఐసీడీఎస్

కడప ఎన్టీఆర్ సర్కిల్, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): జిల్లా రవాణా శాఖ కార్యాలయంలో గత నెలలో చోటుచేసుకున్న లైంగిక వేధింపుల విషయంపై ఐసీడీఎస్ పీడీ శ్రీలక్ష్మి నేతృత్వంలో బుధవారం విచారణ చేపట్టారు. గత నెలలో జిల్లా రవాణా శాఖ కార్యాలయంలో పనిచేస్తున్న ఓ మహిళా ఉద్యోగినితో డీటీసీ చంద్రశేఖర్‌రెడ్డి అసభ్యకరంగా ప్రవర్తించాడనే ఆరోపణలు వచ్చాయి. బాధితులు డీటీసీపై ఉన్నతాధికారులు, పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో జనవరి 24న జాయింట్ ట్రాన్స్‌పోర్ట్ కమిషనర్ బి.కృష్ణవేణి కార్యాలయాన్ని తనిఖీ చేశారు. సీసీ టీవీ ఫుటేజీలను పరిశీలించారు. డీటీసీని హెడ్ ఆఫీస్‌కు సరెండర్ చేశారు. ఆ తర్వాత అతడిని సర్వీసు నుంచి తాత్కాలికంగా తొలగించారు. ఈ వ్యవహారంపై ఐదుగురు అధికారులతో కలెక్టర్ ఒక కమిటీ ఏర్పాటు చేశారు. జడ్పీ సీఈఓ ఓబుళమ్మ, ఐసీడీఎస్ పీడీ శ్రీలక్ష్మి, న్యాయవాది ఉమాదేవి, ఆర్తి విజయ్ ఫౌండేషన్ ప్రెసిడెంట్ సంధ్య, జిల్లా పంచాయతీ అధికారి రాజ్యలక్ష్మి ఈ కమిటీలో ఉన్నారు. ఈ మేరకు బుధవారం కలెక్టరేట్‌లోని 'డి' బ్లాక్‌లో ఉన్న ఐసీడీఎస్ కార్యాలయంలో విచారణకు హాజరు కావాలంటూ ఐసీడీఎస్ పీడీ శ్రీలక్ష్మి నోటీసులు జారీ చేశారు. ఇందులో భాగంగా విచారణకు బాధితురాలితో పాటు డీటీసీ చంద్రశేఖర్‌రెడ్డి హాజరయ్యారు. వారి నుంచి కమిటీ సభ్యులు స్టేట్‌మెంట్ రికార్డు చేసుకున్నారు. అనంతరం ఐసీడీఎస్ పీడీ ఆంధ్రజ్యోతితో మాట్లాడుతూ డీటీసీ కార్యాలయంలో జరిగిన అంశాలపై విచారణ నిర్వహిస్తున్నామని అన్నారు. విచారణ పూర్తయిన తర్వాత సమగ్రంగా ఉన్నతాధికారులకు నివేదిస్తామన్నారు.

అసాంఘికాలకు అడ్డా

- జమ్మలమడుగు, ముద్దనూరు, గండికోటలో..
- విచ్చలవిడిగా సాగుతున్న మట్కా, జూదం
- వైసీపీ పాలనకంటే అధ్వాన్నంగా మారిన వైనం
- లాడ్జీలు, రిసార్టుల కేంద్రంగా దందా
- చోద్యం చూస్తున్న పోలీసు అధికారులు

వైసీపీ పాలనలో విచ్చలవిడిగా సాగిన అసాంఘిక కార్యకలాపాలకు కూటమి ప్రభుత్వం వచ్చాక అడ్డుకట్ట పడుతుందని ప్రజలు భావించారు. అందుకే 164 సీట్లు ఇచ్చి అధికారం కట్టబెట్టారు. కానీ కూటమి ప్రభుత్వం వచ్చాక కూడా అసాంఘిక కార్యకలాపాలు యథేచ్ఛగా సాగుతున్నాయి. ఇందులో అధికార ప్రతిపక్ష పార్టీలనే తేడా లేకుండా.. మట్కా, జూదం వ్యభిచారం జోరుగా సాగిస్తున్నారు. ముఖ్యంగా అధికార పార్టీ నేతల కనుసన్నల్లో ఈ కార్యకలాపాలన్నీ సాగుతున్నాయి. జమ్మలమడుగు నియోజకవర్గంలో జమ్మలమడుగు, ముద్దనూరు, గండికోట ప్రాంతాలు అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారాయి. వీటిపై ప్రజలు పోలీసులకు సమాచారం ఇచ్చినా వారు పట్టించుకోవడంలేదని ఆరోపణలు వినపడుతున్నాయి.



ప్రొద్దుటూరు/జమ్మలమడుగు, ఫిబ్రవరి 5(ఆంధ్రజ్యోతి): ప్రధానంగా జమ్మలమడుగు పట్టణంలోని కొన్ని లాడ్జీలలో మట్కా, జూదం, వ్యభిచారం జోరుగా జరుగుతున్నట్లు బహిరంగంగా ప్రచారం సాగుతోంది. బయటి ప్రాంతాల నుంచి జమ్మలమడుగు పట్టణంలోని లాడ్జీలకు తరుచు వచ్చి జూదం ఆడుతున్నట్లు సమాచారం. ఇక గండికోటలోని రిసార్ట్‌లలో కూడా వ్యభిచారం జరుగుతోందని విశ్వసనీయ వర్గాల సమాచారం. బయటి ప్రాంతాల వారు లాడ్జీలు, రిసార్టులకు అధికంగా డబ్బులు చెల్లించి అద్దెలకు తీసుకుని వ్యభిచారం నిర్వహిస్తున్నట్లు ఆరోపణలున్నాయి.

ఎంపీ ఫిర్యాదుతో..

జమ్మలమడుగు పట్టణంలోని వెంకటేశ్వర కాలనీ, భాగ్యనగర్ కాలనీ, నాగులకట్ట వీధి, బైపాస్ రోడ్డులో, మోరగుడి, పెన్నానది పరిసర ప్రాంతాల్లో జూద గృహాలతో పాటు వ్యభిచార గృహాలు నడుస్తున్నాయి. ముద్దనూరు రోడ్డులోని ఒక రిక్రియేషన్ క్లబ్‌లో నెల రోజుల నుంచి పెద్దఎత్తున బయటి ప్రాంతాల నుంచి రప్పించి జూదం నడిపిస్తున్నట్లు స్వయంగా అధికార పార్టీకి చెందిన ఎంపీనే కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. ఇటీవల స్థానికులు కూడా అధికారులకు ఫిర్యాదు చేయడంతో ముద్దనూరు రోడ్డులోని ఓ లాడ్జీలో పోలీసులు కొందరిని పట్టుకుని సంబంధిత యజమానిపై కేసు నమోదు చేశారు. అలాగే ఆర్డీవో కార్యాలయానికి సమీపాన ఉన్న కొన్ని లాడ్జీలలో జోరుగా అసాంఘిక కార్యకలాపాలు జరుగుతున్నట్టు వచ్చిన సమాచారం మేరకు సంబంధిత యజమానులను పిలిపించి జనవరి 1, 2 తేదీల్లో సీఐ లింగప్ప హెచ్చరించి పంపించారు.

పదిరోజుల ముందుగానే..

గండికోట రిసార్ట్‌లలో పది రోజులు ముందుగానే అక్కడున్న రూములు భర్తీ చేసుకుని జూదం, వ్యభిచారం నడిపిస్తున్నట్లు ఆ ప్రాంత వాసులు బహిరంగంగా ఆరోపణలు చేస్తున్నారు. గండికోట, కొట్టాలపల్లె వెళ్లే దారిలో ఓ రిసార్ట్ లోయ ప్రాంతానికి సమీపాన ఉంది. ఇక్కడ అసాంఘిక కార్యకలాపాలు యథేచ్ఛగా సాగుతున్నాయని స్థానికులు వాపోతున్నారు.

పట్టణంలో పేకాట జోరు

జమ్మలమడుగు పట్టణంలోని పొన్నతోటరోడ్డు శివారులో, గూడెంచెరువు, ఆర్టీసీ బస్టాండు శివార్లలో, కన్నెలూరు, కూరగాయల మార్కెట్ వీధిలో, బురుజువీధి తదితర ప్రాంతాల్లో పేకాట జోరుగా సాగుతోందని అంటున్నారు. అక్కడికి పోలీసులు, అధికారులు వెళ్లాలన్నా భయపడుతున్నట్లు సమాచారం. ఈ అసాంఘిక కార్యకలాపాలు అధికార పార్టీకి చెందిన నేత కనుసన్నుల్లో సాగుతున్నాయని సమాచారం. కొన్ని ప్రాంతాల్లో అధికారపార్టీతో పాటు ప్రతిపక్ష పార్టీ నేతలు కూడా ఈ వ్యవహారాల్లో చురుకుగా ఉన్నట్లు ప్రచారం సాగుతోంది.

కొండలు, పొలాల్లో..

కూటమి ప్రభుత్వం వచ్చాక అసాంఘిక కార్యకలాపాలకు అడ్డుకట్ట పడుతుందనుకుంటే వైసీపీ పాలనలో కంటే విచ్చలవిడిగా మట్కా, జూదం, వ్యభిచారం నడుస్తున్నాయి. జమ్మలమడుగు, గండికోట ప్రాంతాలే కాకుండా నియోజకవర్గంలోని ముద్దనూరు కొండల్లో, పొలాల్లో పేకాట పెద్దఎత్తున సాగుతున్నట్లు సమాచారం. జనవరి నెలలోనే చిన్నకత్తెరపల్లె సమీపంలో పేకాట ఆడుతున్న ఐదుగురిని పోలీసులు పట్టుకుని వారి నుంచి రూ.1.16 లక్షలు నగదు స్వాధీనం చేసుకున్నారు. అయితే ఇక్కడ రూ.5లక్షలకు పైగా నగదు దొరికితే మొదట రూ.22 వేలని చెప్పి మళ్లీ గంటకే రూ.1.16 లక్షలు చూపించారని ఆరోపణలున్నాయి. ముద్దనూరులో ఓ ట్రిబుల్ స్టార్ అధికారి ఇందులో చేతివాటం ప్రదర్శించినట్లు ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఆ అధికారి నగదు నొక్కేయడంతో పాటు మరికొంతమందిని కేసులో పెట్టకుండానే వదిలేశారని ప్రచారం సాగుతోంది.

డీఎస్పీ దృష్టి సారించాలి

జమ్మలమడుగు పట్టణం, ముద్దనూరు, టూరిస్టు ప్రాంతంగా ప్రాచుర్యం పొందుతున్న గండికోటలను అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మార్చుకోవడంపై డీఎస్పీ ప్రత్యేక దృష్టి సారించాల్సి ఉంది. మట్కా, జూదం, వ్యభిచారంలాంటి అసాంఘిక కార్యకలాపాలకు సంబంధించి జమ్మలమడుగు సీఐ లింగప్పను 'ఆంధ్రజ్యోతి' వివరణ కోరగా.. జమ్మలమడుగులో అసాంఘిక కార్యకలాపాలపై ప్రత్యేక నిఘాపెట్టి అరికట్టే చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఇప్పటికే లాడ్జీల యజమానులను పిలిపించి గట్టిగా వార్నింగ్ ఇచ్చామన్నారు. రైడింగ్‌లో దొరికితే కేసులు పెట్టి జైలుకు పంపుతామని హెచ్చరించామన్నారు. కొందరు జూదరులకు గట్టిగా కౌన్సిలింగ్ ఇచ్చామని తెలిపారు.







నగరవనంలో నిర్మించిన పగోడాలు



మదనపల్లెలోని నగరవనం ప్రవేశద్వారం, ఆర్చి

నిధులున్నా నత్తనడకనే...

- నగరవనంలో నిర్మాణాలు పూర్తయ్యేదెన్నడో...
- ఏడాదిన్నరగా కొనసాగుతున్న పనులు
- ఇంకా ప్రారంభం కాని ఆర్కిటెక్ట్ పనులు

మదనపల్లె టౌన్, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): పట్టణ ప్రాంత ప్రజలకు కాస్త ఆహ్లాదాన్ని, వినోదాన్ని, విశ్రాంతిని అందించేందుకు కేంద్ర ప్రభుత్వం నగర వనాల నిర్మాణానికి నిధులు కేటాయించింది. జిల్లాలో మదనపల్లె, రాయచోటి, రైల్వేకోడూరు, రాజంపేట పట్టణాల శివారుల్లో నగరవనాల నిర్మాణానికి శ్రీకారం చుట్టింది. దీనికోసం ఒక్కో నగరవనం నిర్మాణానికి రూ.1.20 కోట్ల నుంచి రూ.1.90 కోట్ల వరకు నిధులు మంజూరు చేసింది. 2023 అక్టోబరు నెలలో మదనపల్లె నగరవనం నిర్మాణానికి శ్రీకారం చుట్టింది.

5.50 ఎకరాల్లో నిర్మాణం

మదనపల్లె పట్టణ శివారులోని పుంగనూరు జాతీయ రహదారి పక్కన ఉన్న అటవీశాఖ స్థలం సోషల్ ఫారెస్ట్‌లో 5.50 ఎకరాల్లో నగరవనం నిర్మాణాన్ని ప్రారంభించారు. ఇందులో భాగంగా నగరవనంలో వాకర్స్ ట్రాక్, పగోడాస్, ఓపెన్ ఎయిర్ సమావేశ హాలు, నగరవనానికి పక్కనే ఉన్న మాదిన కొండపైకి ఎక్కేందుకు ట్రెక్కింగ్ పాత్, కొండపై వ్యూటవర్లు, సెల్ఫీ టవర్ల నిర్మాణం చేపట్టేందుకు చర్యలు చేపట్టారు. మొదటి విడతగా రూ.1.40 కోట్ల నిధులు మంజూరు కాగా అందులో సివిల్ వర్క్స్, పగోడాల (గుడిసెలు) నిర్మాణం, పర్యాటకుల కోసం మరుగుదొడ్లు, తాగునీటి సౌకర్యాలు, వాకింగ్‌పాత్, చిన్నపిల్లలు ఆడుకునేందుకు గేమింగ్ జోన్ తదితరాలు ఏర్పాటు చేయాల్సి ఉంది. ఈ పనులన్నింటిని సివిల్ కాంట్రాక్టర్‌కు అప్పగించి ఉంటే ఈ పనులన్నీ వేగంగా జరిగిపోయేవి. కానీ అటవీశాఖ అధికారులు, ఉద్యోగుల ఆధ్వర్యంలోనే ఈ సివిల్ వర్క్స్ నిర్మాణాలు చేపట్టాలని చెప్పడంతో పనులు ఆలస్యంగా జరుగుతున్నాయి. ఈ పనులు ప్రారంభమై 15 నెలలు గడుస్తున్నా, కేవలం వాకర్స్ పాత్, గేమింగ్ జోన్, మూడు పగోడాలు, రెండు మరుగుదొడ్ల నిర్మాణం మాత్రమే పూర్తి చేశారు. అటవీశాఖ అధికారులు ఒకవైపు దైనందిన విధులు నిర్వహించడం, మరోవైపు నగరవనంలో పనుల పర్యవేక్షణ చేయాల్సి రావడంతో నిర్మాణ పనులు ఆలస్యమవుతున్నట్లు తెలుస్తోంది. అంతేకాకుండా అడవుల్లో జంతువుల వివరాలు, వన సంరక్షణ తదితర నైపుణ్యం ఉన్న అటవీశాఖ అధికారులకు సివిల్ వర్క్స్ చేపట్టడంలో నైపుణ్యం లేకపోవడంతో ఇతరులపై ఆధారపడాల్సి వస్తున్నట్లు తెలుస్తోంది.

సైడ్‌వాల్స్‌తో వాకింగ్ ట్రాక్ నిర్మాణం సరి

మదనపల్లె నగరవనంలో 5.50 ఎకరాల విస్తీర్ణం ఉండటంతో ఈ విస్తీర్ణం చుట్టూ వాకింగ్‌ట్రాక్ నిర్మాణం కోసం సైడ్‌వాల్స్ నిర్మించారు. 15 అడుగుల వెడల్పుతో 4.90 కిలోమీటర్ల పొడవునా నిర్మించిన వాకింగ్ ట్రాక్ మధ్యలో సన్నకంకర పరచి, వర్షం వస్తే బురద చేరకుండా నిర్మాణాలు చేపట్టాల్సి ఉంది. కానీ ఈ పనులు ఇంకా ప్రారంభం కాలేదు. వాకింగ్ ట్రాక్ మధ్యలో వెళుతున్న వంకపై బ్రిడ్జి నిర్మాణానికి సివిల్ ఇంజనీర్ ప్లాన్ తప్పనిసరిగా అవసరం ఉండటంతో ఇక్కడ వాకింగ్ ట్రాక్ పనులు నిలిచిపోయాయి. అంతేకాకుండా నగరవనానికి దక్షిణాన హంద్రీనీవా కాలువ వెళుతుండటం, ఈ కాలువపై నిర్మించిన బ్రిడ్జి కింద కట్ట తెగిపోయి, వర్షపు నీరంతా నగరవనం మీదుగా దిగువకు వెళుతున్నాయి. దీంతో వాకింగ్ ట్రాక్ తెగిపోతోంది. అంతే కాకుండా ఈ వర్షపు నీరు వంకగా మారి నగరవనం సుందరీకరణకు అడ్డుగా మారుతోంది.

తొలి విడతలో రూ.1.40 కోట్ల నిధులు ఖర్చు


మదనపల్లె నగరవనానికి తొలి విడతగా కేంద్ర ప్రభుత్వం రూ.1.40 కోట్ల నిధులు విడుదల చేసింది. ఈ నిధులతో ఇప్పటి వరకు అవసరమైన స్థలాన్ని చదును చేయడం, ప్రవేశద్వారం, ఆర్చి నిర్మాణం, వాకింగ్ ట్రాక్, పగోడాలు, గేమింగ్ జోన్, ఇంటర్నల్ పాత్ దారులు, రెండు మరుగుదొడ్లు మాత్రమే నిర్మించారు. నగరవనంకు ఎగువన వున్న హంద్రీనీవా కాలువకట్టకు ఇరువైపులా సుందరీకరణ, నగరవనంలో క్రోటన్స్, పూల మొక్కలు నాటాల్సి ఉంది. అంతేకాకుండా హంద్రీనీవా కాలువకు ఎగువన ఉన్న మాదిని కొండపైకి వెళ్లేందుకు ట్రెక్కింగ్ పాత్, కొండపై వ్యూ టవర్లు, సెల్ఫీ పాయింట్లు నిర్మించాల్సి ఉంది. వీటితో పాటు నగరవనంలో సుందరంగా, ప్రజలను ఆకట్టుకునేలా ఉండేందుకు ఆర్కిటెక్ట్ నిర్మాణాలు చేపట్టాల్సి ఉంది. ఈ పనులు అటవీశాఖ సిబ్బంది చేత కాకపోవడంతో బెంగళూరుకు చెందిన ఓ ఆర్కిటెక్స్ సంస్థకు ప్రతిపాదనలు పంపాలని అటవీశాఖ అధికారులు కోరారు. ఈ మేరకు బెంగళూరుకు చెందిన ఓ ప్రైవేటు సంస్థ అటవీ శాఖకు ప్రతిపాదనలు పంపింది. ఈ ప్రతిపాదనలను ఉన్నతాధికారులు అప్రూవ్ చేయాల్సి ఉంది.

ఆరునెలలుగా అంతంత మాత్రమే పర్యాటకులు

గత వైసీపీ ప్రభుత్వ పాలనలో 50 శాతం మాత్రమే నిర్మాణాలు పూర్తయిన నగరవనాన్ని అప్పటి పాలకులు హడావుడిగా ప్రారంభించేశారు. 2024 మార్చి నెల నుంచి తాత్కాలికంగా నగరవనంలోకి పర్యాటకులను అనుమతిస్తున్నారు. ఒక్కో పర్యాటకుడి నుంచి పెద్దలకు రూ.20, చిన్నపిల్లలకు రూ.10 చొప్పున టికెట్ వసూలు చేసి లోనికి అనుమతిస్తున్నారు. కాకుంటే ఉదయం, సాయంత్రం సమయాల్లో రోజుకు కేవలం 50 నుంచి 60 మంది మాత్రమే పట్టణ ప్రజలు నగరవనానికి వస్తున్నారు. సరాసరిన తీసుకుంటే నెలలో కేవలం 1873 మంది మాత్రమే నగరవనాన్ని సందర్శిస్తున్నారు.



సుందరంగా తీర్చిదిద్దిన ఇంటర్నల్‌పాత్



నగరవనం ఆనుకునే ట్రెక్కింగ్ కోసం వున్న మాదినికొండ



నగరవనంలో చిన్నారుల కోసం నిర్మించిన గేమింగ్‌జోన్‌లు

రెండు నెలల్లో పూర్తి చేసేందుకు కృషి చేస్తున్నాం

మదనపల్లె నగరవనంలో ఇప్పటి వరకు 70 శాతం పనులు రూ.1.40 కోట్లతో పూర్తి చేశాము. మిగిలిన పనులు, ఆర్కిటెక్ట్ పనులు, హంద్రీనీవా కాలువ సుందరీకరణ పనులు, మాదినకొండపైకి ట్రెక్కింగ్‌పాత్, వ్యూపాయింట్, ఆర్కిటెక్ట్ పనులు పూర్తి చేయడానికి రెండో విడత నిధుల కోసం ఎదురుచూస్తున్నాం. ఈ నిధులు విడుదల చేసిన వెంటనే రెండు నెలల్లో అన్ని నిర్మాణ పనులు పూర్తి చేసి, మదనపల్లె ప్రజలకు అందమైన నగరవనాన్ని అందుబాటులోకి తీసుకొస్తాం.

-జి.జే.ప్రసాదరావు,
ఫారెస్ట్ రేంజ్ అధికారి, మదనపల్లె.

కంటి వైద్యులు కావాలయ్యా..

- పట్టిపీడిస్తున్న సిబ్బంది కొరత
- ఆర్థోపెడిక్ ఆసుపత్రిని అందుబాటులోకి తేవాలి
- ఇదీ వంద పడకల ఆసుపత్రి తీరు



రాయచోటిలోని ఏరియా ఆసుపత్రి

రాయచోటి (కలెక్టరేట్), ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రమైన రాయచోటిలో వంద పడకల ఆసుపత్రి ఏర్పాటై దాదాపు ఏడాది పూర్తి కావస్తున్నా ఇప్పటి వరకు వైద్యులు పూర్తి స్థాయిలో అందుబాటులోకి రాలేదు. జిల్లా కేంద్రంలో ఏదైనా ప్రమాదం జరిగితే కడప రిమ్స్ లేక తిరుపతి స్విమ్స్ ఆసుపత్రులకు ఇక్కడున్న డాక్టర్లు రెఫర్ చేస్తున్నారన్న ఆరోపణలు బలంగా వినపడుతున్నాయి. ఈ వంద పడకల ఆసుపత్రిలో ఆర్థోపెడిక్ సీ-ఏఆర్ఎంను ఇక్కడ ఏర్పాటు చేయలేదు. దీనివల్ల అధునాతమైన పరికరాలు ఇక్కడ లేకపోవడం, సంబంధించిన సిబ్బంది కూడా లేకపోవడం వల్లే ఇతర ప్రాంతాలకు రెఫర్ చేస్తున్నామని ఇక్కడ సిబ్బంది చెప్పుకొస్తున్నారు. జిల్లా కేంద్రంలో వంద పడకల ఆసుపత్రి ఏర్పాటైనప్పటి నుంచి కంటి డాక్టర్ పోస్టుల భర్తీ చేయడం లేదని డాక్టర్లు చెబుతున్నారు. జనవరి నెలలో దాదాపు 23,165 ఓపీలో పేషెంట్లు ట్రీట్మెంట్ తీసుకున్నట్లు లెక్కలు ఉన్నాయి. అంతేగాక ఇన్‌పేషెంట్లు 1156, సర్జరీస్ 54, డెలివరీస్ 96, ఎక్స్‌రే 1099, అల్ట్రా సౌండ్ 611, ఈసీజీ 479, ల్యాబ్ టెస్టింగ్ 16,767 మందికి చికిత్సలు అందించినట్లు సిబ్బంది తెలిపారు. అయితే ఇక్కడ ఎముకలు విరిగితే కట్టడానికి కావాల్సిన పరికరాలు, డాక్టర్లు అందుబాటులో లేరని వారు తెలిపారు. ఈ ఆసుపత్రిలో ఐసీయూ ఏర్పాటుకు ప్రతిపాదనలు పంపించామని వారు తెలిపారు.



కంటి డాక్టర్ లేక తాళం వేసిన రూము

ప్రతిపాదనలు పంపించాం

వంద పడకల ఆసుపత్రిలో ఆర్థోపెడిక్ ఆసుపత్రి ఏర్పాటు చేయడానికి, కంటి డాక్టర్లు భర్తీ చేయడానికి ప్రతిపాదనలు ప్రభుత్వానికి పంపించాం. కంటి వ్యాధి నిపుణులు ఇక్కడ లేకపోవడం వాస్తవమే. నీటి వసతి కూడా ఇక్కడ సరిగ్గా లేదు. త్వరలో ఐసీయూకు ప్రతిపాదనలు మంత్రి ఆదేశాలతో పంపించడానికి మేము సిద్ధంగా ఉన్నాం.

- డేవిడ్ సుకుమార్, ఆసుపత్రి సూపరింటెండెంట్

ఆర్థోపెడిక్ విభాగం ఏర్పాటు చేయాలి

- సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి సిద్దిగాళ్ల శ్రీనివాసులు, రాయచోటి



జిల్లా కేంద్రంలో ఆర్థోపెడిక్ ఆసుపత్రి ఏర్పాటు చేసి ప్రజలకు సేవలు అందించే దిశగా ప్రభుత్వం ఆలోచన చేయాలి. ఈ ప్రాంతానికి దాదాపు పది మండలాలకు సంబంధించిన వారు నిత్యం రాయచోటి పట్టణానికి వచ్చి వారి కార్యక్రమాలు చూసుకుని వెళుతూ ఉంటారు. ఏదైనా ప్రమాదం జరిగినప్పుడు వెంటనే డాక్టర్లు కడపకు లేక తిరుపతికి రెఫర్ చేస్తున్నారు. దాదాపు పది సంవత్సరాల క్రితం ఉండే ఆసుపత్రి ఆచార సంప్రదాయాలు ఇంకా కొనసాగడం దురదృష్టకరం. వంద పడకల ఆసుపత్రిలో ఆర్థోపెడిక్ హాస్పిటల్ పెట్టి కొత్త డాక్టర్లను నియమిస్తే ఇక్కడి ప్రజలకు ఉపయోగకరంగా ఉంటుందని మేము భావిస్తున్నాం. గతం కంటే ఇప్పుడు డాక్టర్లు అక్కడున్నటువంటి సిబ్బంది బాగానే చూస్తున్నారు.

ఇక్కడ బాగానే చూస్తున్నారు



నాకు రెండు రోజుల నుంచి జలుబు, జ్వరం ఎక్కువగా ఉంటే ఇక్కడికి వచ్చి చూపించుకుంటున్నాను. బాగానే చూస్తున్నారు. నేను ఎప్పుడూ ఈ ఆసుపత్రికి రాలేదు. ఇప్పుడు మొదటిసారిగా ఇక్కడికి వచ్చాను. ఈ ఆసుపత్రిలో మందులు కొరతగా ఉందని మాకు చెబుతున్నారు. పారాసిటిమాల్, లివో సిటిజన్ యాంటీబయాటిక్ టాబ్లెట్స్ ఇచ్చారు. దీంతో మీ జబ్బు నయమైపోతుందని డాక్టర్లు చెప్పారు. గతంలో కంటే ఇప్పుడు డాక్టర్లు మంచిగా చూసి మంచి మందులు రాసిస్తున్నారని తెలిసి ఇక్కడికి వచ్చాను.

- పద్మావతి, రాయచోటి

విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో

గృహోపకరణాలు దగ్ధం



దగ్ధమైన వస్తువులను పరిశీలిస్తున్న రెవెన్యూ సిబ్బంది

రామాపురం, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రాచపల్లి పంచాయతీ గంగనేరు క్వార్టర్స్‌లోని దిన్నెపాటి రామక్క ఇంట్లో బుధవారం విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగా గృహోపకరణాలు దగ్ధమయ్యాయని మండల రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ సమ్మత్‌ఖాన్ తెలిపారు. రామక్క ఇటీవలే పక్కా గృహం నిర్మించుకుందని, కులవృత్తిలో భాగంగా దుస్తులు ఉతకడానికి వాగు వద్దకు వెళ్లిన సమయంలో ఇంట్లో మంటలు అంటుకుని బియ్యం, మంచం, బీరువా, నగదు , వస్తువులు ఇతర సామగ్రి పూర్తిగా దగ్ధమయ్యాయన్నారు. గ్రామస్తులు మంటలను అదుపు చేశారని ఆయన తెలిపారు. ఈయన వెంట వీఆర్‌వో వెంకటసుబ్బారెడ్డి, వీఆర్‌ఏలు ఉన్నారు.

తోటలపై ఏనుగుల దాడి



ఏనుగులు తొక్కేసిన టమోటా తోట



రాతి కంచెను ధ్వంసం చేసిన దృశ్యం

సుండుపల్లె, ఫిబ్రవరి5 (ఆంధ్రజ్యోతి): సుండుపల్లె మండలంలోని ముడుంపాడు గ్రామ పంచాయతీలో మంగళవారం రాత్రి డాక్టర్ నాయుని జనార్దన్‌రెడ్డి మామిడి తోటలో ఏనుగులు ప్రవేశించి అక్కడ సాగు చేసిన టమోటా తోటను ధ్వంసం చేసినట్లు స్థానికులు బుధవారం తెలిపారు. పైపులైన్, గేట్ వాల్వులను విరిచేశాయన్నారు. ఏనుగుల బారి నుంచి పైర్లను కాపాడడంతో పాటు, నష్టపరిహారం చెల్లించాలని రైతులు కోరుతున్నారు. నష్టం వివరాలను పరిశీలించి ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళతామని ఫారెస్టు అధికారులు తెలిపారు.

సోషల్ మీడియా పట్ల అప్రమత్తంగా ఉండాలి

- చట్ట వ్యతిరేక కార్యక్రమాలు జరిగితే పోలీసులకు తెలియజేయండి
- అన్నమయ్య పోలీసు వాట్సప్ ఛానల్ ప్రారంభం
- ఎస్పీ విద్యాసాగర్‌నాయుడు

రాయచోటిటౌన్, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): సోషల్ మీడియా పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎస్పీ విద్యాసాగర్‌నాయుడు బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. సోషల్ మీడియా, రోడ్డు, మహిళల భద్రత, బాల్యవివాహాలు, గంజాయి ఇతర మాదకద్రవ్యాలు, క్రికెట్ బెట్టింగ్, సైబర్ క్రైం, వైట్‌కాలర్ నేరాలపై అవగాహనతో పాటు జిల్లా పోలీసు వార్తల కోసం వాట్సప్ ఛానల్‌ను ప్రారంభించామని తెలిపారు. మీ పరిధిలో చట్ట వ్యతిరేక కార్యక్రమాలు జరిగితే వెంటనే పోలీసులకు తెలియజేయాలని, జిల్లా పోలీసు యంత్రాంగం ప్రజలను వాట్సాప్ ఛానల్ ద్వారా అప్రమత్తం చేస్తూనే ఉంటుందని, ప్రతి ఒక్కరూ మా ఛానల్ ద్వారా ప్రసారం అవుతున్న కార్యక్రమాలను వీక్షిస్తూ అప్రమత్తంగా ఉండాలని చెప్పారు. గుర్తు తెలియని వ్యక్తుల నుంచి వచ్చే సందేశాలు, లింక్‌లపై క్లిక్ చేయవద్దని తెలిపారు. రోడ్డు భద్రత అనేది ప్రతి ఒక్కరి బాధ్యత అని, ట్రాఫిక్ నియమాలను తప్పనిసరిగా పాటించాలని, హెల్మెట్ ధరించి వాహనాలను నడపడమే కాకుండా కారులో ప్రయాణించేవారు. తప్పనిసరిగా సీట్ బెల్ట్ పెట్టుకోవాలన్నారు. డ్రైవింగ్ చేసేటప్పుడు ఫోన్ ఉపయోగించకూడదని, మద్యం తాగి వాహనం నడపరాదని తెలిపారు. మహిళలు ఒంటరిగా ప్రయాణం చేసేటప్పుడు జాగ్రత్తగా ఉండాలని, అనుమానాస్పద వ్యక్తుల నుంచి దూరంగా ఉండడమే కాకుండా అత్యవసర పరిస్థితుల్లో పోలీసులకు కాల్ చేయాలన్నారు. బాల్యవివాహాలు చట్టవిరుద్ధమని, బాల్యవివాహాల గురించి ఎవరికైనా తెలిస్తే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలన్నారు. ప్రతిఒక్కరూ మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలని, మాదక ద్రవ్యాల గురించి ఎవరికైనా తెలిస్తే వెంటనే పోలీసులకు తెలియజేయాలన్నారు. క్రికెట్ బెట్టింగ్ చట్టవిరుద్ధమని, బెట్టింగ్‌లో పాల్గొని జీవితాలను నాశనం చేసుకోవద్దన్నారు. మీ వ్యక్తిగత సమాచారాన్ని ఆన్‌లైన్‌లో షేర్ చేయవద్దని, గుర్తు తెలియని లింక్‌లపై క్లిక్ చేయడం మంచిది కాదని, ఓటీపీల గురించి జాగ్రత్తగా ఉండాలన్నారు. పోలీసుల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన 'అన్నమయ్య పోలీసు' వాట్సప్ ఛానల్‌ను, మీరు మీ కుటుంబ సభ్యులు ఫాలో అవుతూ జిల్లాలో ఆండ్రాయిడ్ (ఇంటర్నెట్) వాడుతున్న ప్రతి ఒక్కరి మొబైల్‌లో పోలీసు ఛానల్ ఉండేలా లింకును మీ పరిధిలోని ప్రతి ఒక్కరికీ పంపించేలా చూడాలని పోలీసులను ఆదేశించారు. ముఖ్యంగా అధ్యాపకులు, విద్యార్థినీ, విద్యార్థులకు మన ఛానల్ లింక్ వెంటనే చేరేలా చేయటం మీ బాధ్యత అన్నారు. ఈ బాధ్యత ఒక యజ్ఞంలా కొనసాగాలని, ఇది ఒక టాస్క్ అని ఎస్పీ పోలీసు యంత్రాంగానికి పిలుపునిచ్చారు.



ఎస్పీ విద్యాసాగర్‌నాయుడు



చిరుతపులి మృతకళేబరం వద్ద రైతుతో మాట్లాడుతున్న ఫారెస్టు రేంజ్ ఆఫీసర్

విద్యుదాఘాతంతో చిరుత మృతి

లింగాల, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): అడవిపందుల బెడద నుంచి పంటను కాపాడుకోవడానికి తీసిన విద్యుత్ తీగకు తగిలి చిరుతపులి మృతిచెందిన విషయం ఆలస్యంగా వెలుగు చూసింది. దీనిపై వైఎస్సార్ కడప జిల్లా ముద్దనూరు ఫారెస్టు రేంజ్ ఆఫీసర్ శ్రీనివాసులు మాట్లాడుతూ.. పులివెందుల నియోజకవర్గం లింగాల మండలంలోని రామాపురం గ్రామానికి చెందిన దేవిరెడ్డి భరత్‌కుమార్‌రెడ్డి అడవి పందుల నుంచి శనగ పంటను రక్షించుకునేందుకు పొలం చుట్టూ విద్యుత్ తీగలు ఏర్పాటు చేశాడన్నారు. నాలుగు రోజుల క్రితం అటుగా వచ్చిన చిరుతపులి విద్యుదాఘాతానికి గురై మృతిచెందిందన్నారు. అయితే రైతు చిరుతపులిని సమీపంలోని కొండలో పూడ్చిపెట్టాడని అన్నారు. దీనికి సంబంధించి తమకు సమాచారం రావడంతో బుధవారం రైతును వెంట తీసుకుని సంఘటన స్థలానికి చేరుకుని చిరుత మృతకళేబరాన్ని వెలికితీసి పోస్టుమార్టం నిర్వహించామన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి నిందితుడిని అరెస్టు చేశామన్నారు. కాగా.. ఈ ప్రాంతంలో చిరుతపులి సంచారం ఇదే మొదటిసారి అని స్థానికులు తెలిపారు. తమ పొలాలకు అడవిపందుల బెడద ఎక్కువగా ఉందని, చిరుత సంచారం మాత్రం ఇప్పుడే వెలుగులోకి వచ్చిందని అంటున్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి



చందు (ఫైల్)

వల్లూరు, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): వల్లూరు మండల పరిధిలోని రామిరెడ్డికొట్టాలు సమీపంలో కడప-తాడిపత్రి రహదారిపై జరిగిన రోడ్డు ప్రమాదంలో చందు (18) అనే యువకుడు మృతి చెం దాడు. స్థానికులు, పోలీసుల కథనం మేరకు.. కమలాపురం వాసి చందు అదే కాలనీకి చెందిన రఘునాథ్, బాలు అతని స్నేహితులతో కలిసి సొంత పని నిమిత్తం కడపకు వెళ్లారు. పనిముగించుకుని తిరిగి ద్విచక్ర వాహనంలో ఇంటికి వస్తుండగా రామిరెడ్డికొ ట్టాలు వద్ద గొర్రె అడ్డు రావడంతో బైకు అదుపు తప్పిందని, దీంతో బైకు వెనుక భాగంలో కూర్చుని ఉన్న చందు ఒక పక్కకు ఒరిగాడు. అదే సమయంలో కడప వైపు స్కూటరుపై వెళుతున్న వ్యక్తి బైకుతో ఢీకొట్టాడు. ఈప్రమాదంలో చందు తల నుజ్జు నుజ్జు అయి అక్కడికక్కడే మృతి చెందాడు. ఇన్ చార్జ్ ఎస్ఐ ప్రతాప్‌రెడ్డి, ఏఎస్ఐ ప్రసాద్ పోలీసులు సంఘ టనా స్థలం వద్దకు వచ్చి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కడపకు తరలించి.. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

బీటెక్ విద్యార్థిని ఆత్మహత్య



రాజంపేట టౌన్, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి) : రాజంపేట పట్టణంలోని ఓ ప్రైవేట్ ఇంజనీరింగ్ కాలేజిలో బీటెక్ చదువుతున్న వెన్నపూస అఖిల (22) బుధవారం ఆత్మహత్య చేసుకుంది. వివరాల్లోకి వెళితే... అనంతపురం జిల్లా పెద్దపప్పూరు మండలం సి.చిక్కేపల్లి గ్రామానికి చెందిన పి.చెన్నారెడ్డి, రమణమ్మల చిన్న కుమార్తె అయిన అఖిల బీటెక్ (సీఎస్ఈ) చివరి సంవత్సరం చదువుతోంది. ప్రైవేటు హాస్టల్లో ఉంటున్న అఖిల బుధవారం సాయంత్రం 5 గంటల సమయంలో తన గదికి గడియ పెట్టుకుని చున్నీతో ఉరి వేసుకుని మృతి చెందింది. ఈ విషయం తెలుసుకున్న కొందరు వెంటనే పోలీసులకు సమాచారం ఇచ్చారు. మన్నూరు పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని గదిలోని మృతదేహాన్ని పరిశీలించి పోస్టుమార్టం నిమిత్తం రాజంపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు. ఇందుకు గల కారణాలు తెలియరాలేదు. వారి తల్లిదండ్రులకు సమాచారం అందించడంతో వారు రాజంపేటకు బయలుదేరినట్లు పోలీసులు తెలిపారు.

విద్యుదాఘాతంతో చెలరేగిన మంటలు

● ఇంటి సామాగ్రి దగ్ధం ● రూ.లక్షల ఆస్థినష్టం

బద్వేలుటౌన్, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): విద్యుత్తు షార్ట్‌సర్క్యూట్‌తో ఫ్రిజ్ నుంచి ఒక్కసారిగా మంటలు వ్యాపించి ఇంట్లోని సామగ్రి అంతా కాలిపోయిన ఘటన బద్వేలు మున్సిపాలిటీ పరిధిలోని త్యాగరాజకాలనీలో చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళితే.. త్యాగరాజు కాలనీలో నివాసం ఉంటున్న వనిపెంట వెంకటసుబ్బమ్మ ఇంట్లో షార్ట్‌సర్క్యూట్‌తో ఒక్కసారిగా మంట లు చెలరేగాయి. దీంతో స్థానికులు అదుపు చేసేందుకు ప్రయ త్నించి ఫైర్‌సిబ్బందికి సమాచారం అందించగా, ఫైరింజన్ వచ్చి మంటలను అదుపుచేసే లోపే ఇంటిలోని విలువైన సామాగ్రి అంతా కాలిపోయింది. దీంతో ఇంట్లో మనవరాలి పెళ్లికోసం తెచ్చి పెట్టుకున్న బంగారు నగలు, పట్టుచీరలు, ఫ్రిజ్, టీవీ, బీరువాలోని బట్టలన్నీ కాలిపోయాయి. ఈఘటనలో దాదాపు రూ.5లక్షలకు పైగా ఆస్తినష్టం వాటిల్లిందని బాధితురాలు వాపోతున్నారు.

భార్య కాపురానికి రాలేదని వ్యక్తి ఆత్మహత్య

జమ్మలమడుగు, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): జమ్మలమడుగు మండలంలోని గూడెం చెరువు గ్రామంలో బుధవారం సాయంత్రం తూగుట్లపల్లె చెన్నప్ప (37) అనే వ్యక్తి ఇంటిలో ఫ్యానుకు చీరెతో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు.పోలీసుల వివరాల మేరకు... చెన్నప్ప డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. ఈయనకు సత్యసాయి జిల్లా ముదిగుబ్బ మండలం పాలెం గ్రామానికి చెందిన వరలక్ష్మిని వివాహం చేసుకున్నాడు. వీరికి ముగ్గురు సంతానం. సంక్రాంతి పండుగకు గూడెం చెరువు వద్ద నుంచి అమ్మగారి ఇంటికి వెళ్లిన వరలక్ష్మి తిరిగి రాలేదు. దీంతో మనస్థాపం చెందిన చెన్నప్ప ఇంటిలో తల్లి పుల్లమ్మతో గొడవపడి ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఘటనా స్థలాన్ని అర్బన్ సీఐ లింగప్ప పరిశీలించారు. కేసు నమోదు చేసినట్లు అర్బన్ పోలీసులు తెలిపారు.

చౌడేశ్వరీదేవి ఆలయంలో చోరీ

జమ్మలమడుగు, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): జమ్మలమడుగు మున్సిపాలిటీ పరిధి నాగులకట్ట వీధిలోని చౌడేశ్వరీదేవాలయంలో బుధవారం చోరీ జరిగింది. మధ్యాహ్నం 12.30 గంటల సమయంలో గుర్తు తెలియని వ్యక్తి ఆలయంలోకి ప్రవేశించి గుడిలో ఉన్న అమ్మవారి నాలుగు వెండి హస్తాలు (600 గ్రాములు), శఠారి 400 గ్రాములు, తాళిబొట్టు అరతులం చోరీ చేశారని ఆలయ అధ్యక్షుడు జి.తిరుమలదాసు అర్బన్ పోలీసు స్టేషన్‌లో బుధవారం రాత్రి ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు అర్బన్ సీఐ లింగప్ప తెలిపారు.

తూకాల్లో మోసం చేస్తే కఠిన చర్యలు : జేసీ



బియ్యం గోడౌన్‌లో రికార్డులు పరిశీలిస్తున్న జేసీ అదితిసింగ్

వేంపల్లె, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): గోడౌన్లలో డీలర్లకు అందించే బియ్యం బస్తాల్లో, రేషన్‌షాపుల్లో ప్రజలకు ఇచ్చే తూకాల్లో మోసం జరిగినట్లు తెలిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని జాయింట్ కలెక్టర్ అదితి సింగ్ హెచ్చరించారు. తూకాల్లో తక్కువ రాకుండా తనిఖీ చేపట్టాలని తహసీల్దార్ హరినాథ్‌రెడ్డి, ఎన్‌ఫోర్స్‌మెంట్ డీటీ సుధీర్, ఇతర అధికారులను ఆదేశించారు. వేంపల్లె బియ్యం గోడౌన్‌ను జేసీ తనిఖీ చేసి రికార్డులు పరిశీలించారు. అనంతరం చింతలమడుగుపల్లె వద్ద రేషన్ ఎండీయూ వాహనాన్ని పరిశీలించారు. అనంతరం కత్తలూరు పంచాయతీలో జరుగుతున్న భూముల రీసర్వేను పరిశీలించి తగు సూచనలిచ్చారు. కార్యక్రమంలో రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.

రీసర్వే పక్కాగా చేపట్టాలి

పెండ్లిమర్రి, ఫిబ్రవరి (ఆంధ్రజ్యోతి): మండలంలో జరుగుతున్న రీసర్వే పనులను కచ్చితత్వం వుండేలా చేపట్టాలని జాయింట్ కలె క్టర్ అదితి సింగ్ తెలిపారు. కొండూరు, చీమలపెంట గ్రామాల్లో జరుగుతున్న రీసర్వే పనులను బుధవారం జాయింట్ కలెక్టర్ పరిశీలించారు. సర్వే సిబ్బందికి పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. కార్యక్రమంలో తహసీల్దార్ అనురాధ, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

జాతీయ జంబోరి వేడుకల్లో స్కౌట్ విద్యార్థుల ప్రతిభ



ప్రతిభ చూపిన స్కౌట్ విద్యార్థులను అభినందిస్తున్న ఎస్పీ

రాయచోటిటౌన్, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): తమిళనాడులోని తిరుచురాపల్లిలో జనవరి 28 నుంచి ఫిబ్రవరి 3వ తేదీ వరకు నిర్వహించిన స్కౌట్ అండ్ గైడ్స్ డైమండ్ జూబ్లీ జంబోరి వేడుకల్లో పాల్గొని ప్రతిభ చూపిన అన్నమయ్య జిల్లా స్కౌట్ విద్యార్థులను బుధవారం ఎస్పీ విద్యాసాగర్‌నాయుడు అభినందించారు. జంబోరి వేడుకల్లో ప్రతిభ చూపి ఎస్పీ ద్వారా అభినందనలు పొందిన వారిలో సంబేపల్లె జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థులు తరుణ్ కుమార్‌గౌడ్, వీరవెంకటప్రణీత్, నాగచైతన్యరెడ్డి, వెంకటేశ్వర, శ్రీనివాసులు ఉన్నారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ మన విద్యార్థులు జాతీయ జంబోరి వేడుకల్లో పాల్గొని ప్రతిభ చూపి జిల్లాకు పేరు తేవడం గర్వకారణంగా ఉందన్నారు. జిల్లా సెక్రటరీ మడితాటి నరసింహారెడ్డి మాట్లాడుతూ స్కౌట్స్ అండ్ గైడ్స్‌లో 4 సంవత్సరాలకు ఒకసారి నిర్వహించే జాతీయ జంబోరి అనేది విద్యార్థులకు ఒక పండుగ లాంటిదన్నారు. దేశంలోని వివిధ రాష్ట్రాల నుంచే కాకుండా ఇతర దేశాల నుంచి దాదాపు 25 వేల మంది హాజరైన ఈ వేడుకల్లో సాంస్కృతిక కార్యక్రమాల ప్రదర్శన, ఫుడ్ ఎగ్జిబిషన్, మార్చ్‌ఫాస్ట్, యోగా, క్యాంపు ఫైర్ తదితర విభాగాల్లో మన విద్యార్థులు పాల్గొని ప్రతిభ చూపారన్నారు. అనంతరం డీఆర్‌వో మధుసూదన్‌రావు, డీఈవో సుబ్రమణ్యం, డీవైఈవో శివప్రకాశ్‌రెడ్డి, విద్యార్థులకు అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో స్కౌట్ మాస్టర్ నితిన్‌రెడ్డి, నోబెల్ టీచర్స్ అసోషియేషన్ రాష్ట్ర బాధ్యులు కొండూరు శ్రీనివాసరాజు, డీసీఈబీ సెక్రటరీ నాగమునిరెడ్డి, ఎస్టీయూ జిల్లా అధ్యక్షుడు శివారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

10 నుంచి హరిహరక్షేత్రం బ్రహ్మోత్సవాలు



చెన్నకేశవస్వామి ప్రధాన దేవాలయం



వల్లూరు, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పైడికాల్వ గ్రామంలో పవిత్ర పాపాఘ్నినది తీరాన వెలసిన రాజ్యలక్ష్మి సమేత చెన్నకేశవస్వాముల వార్షిక బ్రహ్మోత్సవాలను 10వ తేదీ నుంచి వేడు కగా నిర్వహిస్తున్నట్లు ఆలయ ప్రధాన అర్చకులు హరినారాయణశర్మ తెలిపారు. 10న ఉదయం రాక్షసోగ్న హోమం, వాస్తు హోమాలు, అఘోరరుద్ర, భాద్ర పారాయణాలు, లలితా లక్ష్మి విష్ణు సహస్ర పారాయణం చేస్తామన్నారు. 11న మంగళవారం చండీహోమం, మహామృత్యుంజయహోమం, లక్ష్మీనారాయణ హృదయ హోమం, సువర్చలాదేవి సమేత హనుమాన్‌హోమాన్ని నిర్వహిస్తామన్నారు. సాయంత్రం 4గంటలకు సుబ్రమణ్యహోమం, నాగశాంతి, పరిహార అశ్లేష బలి నిర్వహించి మహామంగళహారతి నిర్వహిస్తామన్నారు. 12న బుధవారం మాఘ పౌర్ణమి సందర్భంగా సీతల ఇంద్రాక్షి హోమాలు, ఏకాదశ రుద్ర, సంకల్పిత హోమాలను నిర్వహించి.. మహా పూర్ణాహుతి అనంతరం స్వామివారికి కుంభాభిషేకం ఉం. అనంతరం శ్రీదేవి భూదేవి సమేత చెన్నకేశవస్వామి కల్యాణం నిర్వహిస్తామన్నారు. మధ్యాహ్నం 12గంటలకు అన్నసంతర్పణ వుంటుందని తెలిపారు. అలాగే బ్రహ్మోత్సవాల సందర్భంగా సాంస్కృతిక కార్యక్రమాలు, హరికథా కాలక్షేపం ఉంటాయన్నారు.

న్యాయసేవలను విస్తరింపచేయాలి

● సీనియర్ సివిల్ జడ్జి బాబాపక్రుద్దీన్

కడప రూరల్, ఫిబ్రవరి 5: జాతీయ న్యాయసేవాధికార సంస్థ(నల్సా) అందిస్తున్న పథకాలను, న్యాయసేవలను విస్తరింపచేయాలని డీఎల్ఎస్ఏ సెక్రటరీ, సీనియర్ సివిల్ జడ్జి బాబాపక్రుద్దీన్ పేర్కొన్నారు. బుధవారం జిల్లా కోర్టు ఆవరణలోని న్యాయసేవాసదన్‌లో సభ్యులకు సెన్సిటైజేషన్ ప్రోగ్రామ్‌ను నిర్వహించారు. ఈ సందర్భంగా జడ్జి మాట్లాడుతూ నల్సా వారి బాలల సంరక్షణ కోసం స్నేహపూర్వక న్యాయసేవల పథకం 2024, లీగల్ సర్వీసెస్ అథారిటీ యాక్టు 1987, బాలల, కౌమార లేబర్ చట్టం 1986, బాలల హక్కుల పరిరక్షణ చట్టం 2005, పిల్లల నిషేధ వివాహ చట్టం 2006, బాల్య న్యాయచట్టం 2015, ఉచిత, నిర్బంధ విద్యకోసం పిల్లల హక్కు చట్టం 2009 తదితర వాటిని తెలుసుకుని వాటిని ప్రయోజనాలను తెలియజేయాలన్నారు. కార్యక్రమంలో పలు శాఖల అధికారులు, సీనియర్ సిటిజన్స్, సభ్యులు పాల్గొన్నారు.

ప్రొద్దుటూరు నుంచి కుంభమేళాకు ఆర్టీసీ బస్ టూర్

ప్రొద్దుటూరు అర్బన్ ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): ప్రొద్దుటూరు నుంచి కుంభమేళాకు ఆర్టీసీ బస్ టూర్‌ను ఏర్పాటు చేశామని డిపో మేనేజర్ మల్లికార్జునరెడ్డి తెలిపారు. ఈ బస్సు ప్రొద్దుటూరు ఆర్టీసీ డిపో నుంచి ఈనెల 10వ తేదీ మధ్యాహ్నం 1 గంటకు బస్సు బయలుదేరుతుందన్నారు. అన్నవరం, సింహాచలం, అరసవిల్లి, శ్రీకూర్మం, పూరి, గయా, బుద్ధగయ, అయోధ్య, వారణాసి, ప్రయాగ తిరిగి పిఠాపురం, సామర్లకోట, విజయవాడ మీదుగా ప్రొద్దుటూరుకు చేరుకుంటుందన్నారు. ఈ టూరు పది రోజులు ఉంటుందని ఆ సమయంలో టూరిస్టులకు ఉదయం, మధ్యాహ్నం, సాయంత్రం భోజన సదుపాయం కల్పిస్తామన్నారు. ఒక వ్యక్తికి రూ.13500 ధర నిర్ణయించడం జరిగిందన్నారు. టూరుకు రాదల్చినవారు టికెట్ బుకింగ్, మరింత సమాచారం కోసం 7382866916, 9966525210, 7382867512 ఫోన్ నెంబర్లలో సంప్రదించాలని కోరారు.

రాయలసీమలో అత్యంత విలువైన వారసత్వ సంపద

వైఎస్సార్ ఆర్కిటెక్చర్ వర్సిటీ వీసీ డాక్టర్ విశ్వనాథ్‌కుమార్



విద్యార్థులతో వీసీ విశ్వనాథ్‌కుమార్, ఇంటాక్ ప్రతినిధులు

కడప ఎడ్యుకేషన్, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): రాయలసీమలో అత్యంత విలువైన వారసత్వ సంపద ఉందని వైఎస్సార్ ఆర్కిటెక్చర్ అండ్ ఫైన్ ఆర్ట్స్ యూనివర్సిటీ వీసీ డాక్టర్ విశ్వనాథ్‌కుమార్ తెలిపారు. నేటితరం బాలలకు వారసత్వ సంపద విలువ పట్ల అవగాహన కల్పిస్తేనే దాన్ని రక్షించుకోవచ్చని స్పష్టం చేశారు. బుధవారం కడప నగరం ఎస్వీ ఇంజనీరింగ్ కళాశాల ఇంటెక్ ఆధ్వర్యంలో నగరానికిచెందిన విద్యార్థులకు సెలబ్రేటింగ్ ఇండియా పేరిట పోస్టర్ తయారీ పోటీ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ ప్రపంచంలో ఎంతో అపురూపమైన వారసత్వ సంపద ఉందని, అందులో మనదేశం ఏమాత్రం తక్కువ కాదని, ప్రధానంగా రాయలసీమలో కూడా ఎంతో విలువైన వారసత్వ సంపద ఉందన్నారు. దీనిపై అవగాహన కలిగినప్పుడే ఆ సంపదను రక్షించుకోవాల్సిన అవసరం గురించి తెలుస్తుందన్నారు. ఇంటాక్ జిల్లా కన్వీనర్ లయన్ కె.చిన్నపరెడ్డి, ఎస్వీ ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపల్ వీరసుదర్శన్‌రెడ్డి ప్రసంగించారు. లయన్స్ క్లబ్ ఆఫ్ కడప, అన్నమయ్య జిల్లా అధ్యక్షుడు ఎ.వెంకటసుబ్బయ్య, పూర్వ అధ్యక్షుడు పోతుల వెంకటరామిరెడ్డి, ఎస్సీ సంక్షేమ శాఖ ఉప సంచాలకులు డాక్టర్ వల్లూరు బ్రహ్మయ్య పోటీలను పర్యవేక్షించారు. కార్యక్రమంలో కోకన్వీనర్ టీవీ సుబ్బారెడ్డి, సభ్యులు కె.సంజీవరెడ్డి, మాజీ ఎమ్మెల్సీ సుబ్బారెడ్డి, టెక్నికల్ విభాగం ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

దౌర్జన్యంగా శనగ పంట దున్నేశారు

● న్యాయం చేయాలని రైతు ఎస్.నాగసుబ్బారెడ్డి వినతి



దున్నిన శనగ పంటను చూపుతున్న రైతు నాగ సుబ్బారెడ్డి

జమ్మలమడుగు, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): తన పొలంలో సాగు చేసిన శనగ పంటను ఓ వ్యక్తి దౌర్జన్యంగా ట్రాక్టర్‌తో దున్నేయడంతో తీవ్రంగా నష్టపోయానని బాధిత రైతు ఎస్.నాగసుబ్బారెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. పెద్దముడియం మండలం పెద్దపసుపుల గ్రామానికి చెందిన నాగసుబ్బా రెడ్డి జమ్మలమడుగులో బుధవారం సాయంత్రం విలేకరుల ఎదుట జరిగిన నష్టానికి సంబంధించి తెలిపారు. పెద్దపసుపుల గ్రామంలో సర్వే నంబరు 115/1లో తాను 4.23 ఎకరాల్లో శనగ పంట సాగు చేశానన్నారు. ఐదు రోజుల్లో కోత పెట్టాల్సి ఉంది. అంతలోపు శెట్టిపల్లె శ్రీరామరెడ్డి తన పంట పొలంలోకి ట్రాక్టర్ తీసుకొచ్చి దౌర్జన్యంగా దున్నేశారన్నారు. దీంతో తనకు దాదాపు రూ.2 లక్షలు నష్టం వాటిల్లిందని వాపోయాడు. ఈ విషయం పెద్దముడియం పోలీసులకు తెలియజేశానన్నారు. మూడు రోజుల నుంచి జమ్మలమడుగు పోలీసు స్టేషన్, రూరల్ సీఐ కార్యాలయం చుట్టూ తిరుగుతున్నా తనకు న్యాయం జరుగలేదని వాపోయాడు. గత అయిదు సంవత్సరాల నుంచి పొలం తగాదా ఉందని.. తమకు న్యాయం చేయాలని బుధవారం సాయంత్రం వెళితే ఎవరూ స్పందించలేదన్నారు. ఇప్పటికైనా జిల్లా అధికారులు న్యాయం చేయాలని ఆయన విజ్ఞప్తి చేశాడు. ఈ విషయంపై పెద్దముడియం ఎస్ఐ సుబ్బారావును వివరణ కోరగా.. బాధిత రైతు ఇప్పటి వరకు తమకు ఫిర్యాదు చేయలేదని.. ఫిర్యాదు చేస్తే కేసు నమోదు చేస్తామని తెలిపారు.

వెల్లటూరులో జర్మన్ బృందం పర్యటన

● ప్రకృతి వ్యవసాయ క్షేత్రాల సందర్శన



రైతులతో మాట్లాడుతున్న విదేశీ ప్రతినిధుల బృందం

పెండ్లిమర్రి, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): జర్మన్ దేశానికి చెందిన జాతీయ బ్యాంక్ కేఎఫ్‌డబ్ల్యూ ప్రతినిధుల బృందం బుధవారం వెల్లటూరు గ్రామంలో వ్యవసాయ క్షేత్రాలను సందర్శించింది. బృంద సభ్యులు రైతు హరిప్రియ పొలంలో విత్తన గుళికల విధానాన్ని ఉపయోగించి వేసిన అలసంద పంట ప్రయోగాత్మక ప్లాట్‌ను పరిశీలించి ప్రయో జనాలను వివరంగా అడిగి తెలుసుకున్నారు. అనంతరం రైతులు విత్తిన గుళికల తయారీ విధానాన్ని డెమో పద్ధతిలో ప్రత్యక్షంగా ప్రదర్శించి వాటి ప్రయోజనాలను వివరించారు. కార్యక్రమంలో రైతుసాధికారిక సంస్థ సీనియర్ అధికారులు మురళీధర్ ఏటి శివారెడ్డి, డీపీఎం ప్రవీణ్ కుమార్, అదనపు డీపీఎం వసంత కుమారి, విదేశీ బృంద సభ్యులు మార్క్ ప్రెయిన్, సర్వీ నాబుయర్స్, సంగీత అగర్వాల్, అన్నా బెరెజోవ్ స్కాజా, సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

ఫ్యాకల్టీ ఆఫ్ సైన్సెస్ డీన్‌గా ఆచార్య ఏజీ దాము



నియామకపత్రాన్ని అందిస్తున్న వీసీ కృష్ణారెడ్డి, ప్రిన్సిపాల్ రఘునాథరెడ్డి

కడప ఎడ్యుకేషన్, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): యోగివేమన విశ్వవిద్యాలయం కెమిస్ట్రీ విభాగం ప్రొఫెసర్ ఏజీ దామును ఫ్యాకల్టీ ఆఫ్‌సైన్సెస్ డీన్‌గా నియమిస్తూ ఉత్తర్వులు జారీ అయ్యాయి. విశ్వవిద్యాలయంలోని వీసీ చాంబర్‌లో ఆచార్య ఏజీ దాముకు ఉపకులపతి ఆచార్య కె.కృష్ణారెడ్డి, కులసచివులు ఆచార్య పి.పద్మ, ప్రధానాచార్యులు ఎస్.రఘునాథరెడ్డితో కలిసి నియామకపు పత్రాన్ని అందించారు. ఇది వరకు డీన్‌గా పనిచేస్తున్న ఆచార్య కృష్ణారెడ్డి పదవీకాలం పూర్తికావడంతో ఈ నూతన నియామకం చేపట్టారు. కార్యక్రమంలో ప్రజాసంబంధాల విభాగ సంచాలకులు డాక్టర్ పి.సరిత, సహ ఆచార్యులు డాక్టర్ వెంకటరామ్ పాల్గొన్నారు.

పచ్చదనం, పరిశుభ్రతను విస్మరించవద్దు



పెన్నానదిలో వ్యర్థాలు ఏరివేస్తున్న విద్యార్థులు

చెన్నూరు, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): పచ్చదనం పరిశుభ్రతను ఎవరూ విస్మరించవద్దని జిల్లా నేషనల్ గ్రీన్‌కోర్ కమిటీ కోఆర్డినేటరు రమణయ్య అన్నారు. కొండపేట జడ్పీహైస్కూల్‌లో బుధవారం పాఠశాల విద్యార్థినీ, విద్యార్థులకు ప్రకృతి వనరులపై అవగాహన కల్పించారు. నేషనల్ గ్రీన్‌కోర్ ఏపీ డైరెక్టరు స్రవంతి ఆదేశాల మేరకు డీఈఓ ఆధ్వర్యంలో ప్రపంచ చిత్తడి నేలల దినోత్సవంలో భాగంగా విద్యార్థులతో ర్యాలీ నిర్వహిస్తారన్నారు. పెన్నానదిలో పడేసిన వ్యర్థాలను గాలికి కొట్టుకువచ్చిన వ్యర్థాలు ఏరివేశారు. అనంతరం మాట్లాడుతూ సహజ వనరులను అందరం కాపాడుకోవాలని, అదే సమయంలో పచ్చదనం పెంచాలన్నారు. విద్యుత్ పొదుపుగా వాడుకోవాలని నీటిని వృథా చేయరాదని ఇంటి అవసరాలకు వినియోగించే గ్యాస్ పొదుపుగా వాడుకుంటే ఇటు ఆదాయం, అటు భవిష్యత్‌తరాలకు అందించే వారమవుతామన్నారు. ఉచితంగా వస్తున్నాయని ఇప్పుడు వృథా చేస్తే భవిష్యత్తులో అదే మనకు అందకుండా మన కష్టాలకు ఇబ్బందులకు కారణ మవుతుందన్నారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు పద్మనాభం, వెంకటరమణయ్య, రత్నాదేవి, వెంకటసుబ్బయ్య, అనురాధ, ఇందిరామణి, కమాల్‌బీ, నాగిరెడ్డి, ఉపాధ్యాయులు సత్యనారాయణ, రాఘవేంద్ర, రంగనాయకులు రెడ్డయ్య పాల్గొన్నారు.

ఉయ్యాలవాడ వర్ధంతి సభను జయప్రదం చేయండి

కడప మారుతీనగర్, ఫిబ్రవరి 5, (ఆంధ్రజ్యోతి): స్థానిక ప్రెస్‌క్లబ్‌లో 22న తలపెట్టిన తొలి స్వాతంత్ర్య సమరయోధుడు ఉయ్యాలవాడ నరసింహారెడ్డి వర్ధంతి సభను జయప్రదం చేయాలని రాయలసీమ కమ్యూనిస్టు పార్టీ కార్యదర్శి ఎన్. రవిశంకర్ రెడ్డి పిలుపునిచ్చారు. స్థానిక ప్రెస్‌క్లబ్‌లో విలేకరులతో ఆయన మాట్లాడుతూ కుల, మతాలకు వ్యతిరేకంగా అన్ని వర్గాల ప్రజలు, అన్ని పార్టీల, ప్రజా సంఘాల నేతలు తప్పక హాజరవాలని కోరారు. రేనాటి సూర్యచంద్రుల కమిటీ ఆధ్వర్యంలో టీడీపీ జిల్లా అధికారప్రతినిధి మన్నూరు అక్బర్, జానమద్ది సాహితీపీఠం అధ్యక్షుడు జానమద్ది విజయభాస్కర్ మాట్లాడుతూ కడప నగరంలో ఉయ్యాలవాడ నరసింహారెడ్డి విగ్రహం, మహాదాత బుడ్డా వెంగళరెడ్డి కాంస్య విగ్రహాలను ఏర్పాటు చేయాలని రెండేళ్లగా ప్రయత్నాలు సాగిస్తున్నామన్నారు. ఇటీవల జరిగిన మునిసిపల్ కార్పొరేషన్ సమావేశంలో విగ్రహాల ఏర్పాటును ఆమోదిస్తూ తీర్మానించారన్నారు. విగ్రహ శంకుస్థాపనల కోసం 22వ తేదీ లోపు తమకు స్థలం కూడా కేటాయించాలని కోరారు. సమావేశంలో ఏపీ రెడ్డి సంఘం జిల్లా అధ్యక్షుడు విజయభాస్కర్‌రెడ్డి, సీహెచ్‌ఆర్‌డీ అధ్యక్షుడు పుత్తా శివారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలి

సీఎస్ విజయానంద్‌ను కలిసి ఏఐటీయూసీ విద్యుత్ కార్మిక సంఘం నేతలు



సీఎస్ విజయానంద్‌ను కలిసి సమస్యలను విన్నవిస్తున్న ఏఐటీయూసీ విద్యుత్ కార్మిక సంఘం నేతలు

కడప నాగరాజుపేట, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని విద్యుత్ ఉత్పత్తి, పంపిణీ, సరఫరా విభాగాల్లో పనిచేస్తున్న ఉద్యోగుల, కార్మికుల సమస్యలు పరిష్కరించాలని ఏపీ ఎలక్ట్రిసిటీ స్టాఫ్ అండ్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు బి.రామలింగారెడ్డి, ప్రధాన కార్యదర్శి పొన్న శివయ్య కోరారు. బుధవారం విజయవాడలోని ఏపీ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి విజయానంద్‌ను క్యాంప్ కార్యాలయంలో కలిసి వినతిపత్రం ఇచ్చిన వారు మాట్లాడుతూ విద్యుత్ రంగంలో 30వేల పైచిలుకు ఒప్పంద ప్రతిపాదికన కార్మికులు పనిచేస్తున్నారని వారికి ఉద్యోగ భద్రత కల్పించి రెగ్యులరైజ్ చేయాలని కోరారు. పీఆర్సీ అరియర్స్ ఇవ్వాలని, గ్రామ, వార్డు సచివాలయాల్లో పనిచేస్తున్న ఎనర్జీ అసిస్టెంట్లకు ప్రొబేషన్ డిక్లరేషన్ చేయాలని, ఎలక్ట్రిసిటీ బోర్డు సర్వీస్ రూల్స్ అమలు చేయాలని, విద్యుత్ ఉద్యోగులకు ఈపీఎఫ్ నుంచి జీపీఎఫ్‌గా మార్పు చేసి పాత విధానంలో పింఛన్ అమలు చేయాలని విద్యుత్ ఉద్యోగులకు నగదు రహిత అపరిమిత ఆరోగ్య పాలసీని తీసుకురావాలని కోరారు. ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి విజయానంద్ మాట్లాడుతూ విద్యుత్ రంగంలో పనిచేస్తున్న ఉద్యోగుల, కార్మికుల సమస్యలు అన్నింటిపై అవగాహన ఉందని, ఒక్కొక్కటిగా పరిష్కారిస్తామని తెలిపారు. కార్యక్రమంలో ఏపీ ఎలక్ట్రిసిటీ స్టాఫ్ అండ్ వర్కర్స్ యూనియన్ డిప్యూటీ జనరల్ సెక్రటరీ కె.బ్రహ్మానందరెడ్డి, గ్రామ, వార్డు ఎనర్జీ అసిస్టెంట్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు కె.మల్లికార్జునరెడ్డి, జనరల్ సెక్రటరీ శ్రీనివాసశేఖర్, వర్కింగ్ ప్రెసిడెంట్ ఏసోబు, వైస్ ప్రెసిడెంట్ ఎం.గంగాధర్ పాల్గొన్నారు.

అమరావతిలో ఒక రేటు రాష్ట్రమంతా మరోరేటా?

రిజిస్ట్రేషన్ చార్జీలపై పాకా సురేష్



విలేకరులతో మాట్లాడుతున్న పాకా సురేష్

కడప ఎర్రముక్కపల్లె, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): రిజిస్ట్రేషన్ చార్జీలకు సంబంధించి రాష్ట్రమంతా రిజిస్ట్రేషన్ చార్జీలు పెంచి అమరావతిలో పెంచకపోవడం ఏమిటని వైసీపీ రాష్ట్రసమితి కార్యదర్శి పాకా సురేష్ ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. పెంచిన చార్జీలు తక్షణం తగ్గించాలని డిమాండ్ చేశారు. బుధవారం తన కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఫిబ్రవరి 1వ తేదీ నుంచి రాష్ట్రంలో భారీగా రిజిస్ట్రేషన్ చార్జీలు పెంచారన్నారు. అప్పులు వడ్డీలు అన్నీ కలిపి రాష్ట్రంలో ప్రజలంతా కట్టాల్సి ఉందన్నారు. అమరావతిలో రిజిస్ట్రేషన్ విలువ ఎందుకు పెంచలేదని ప్రశ్నించారు. చంద్రబాబును నమ్మి కూటమి ప్రభుత్వానికి ఓటు వేసిన ప్రజలు గెలిపించాలని చెప్పారు. సూపర్ సిక్స్ పేరు చెప్పి గద్దెనెక్కి కూటమి ప్రభుత్వం రాష్ట్ర ప్రజలపై చార్జీలు పెంచడం దుర్మార్గమన్నారు. సంపద సృష్టించడం అంటే ఇదేనా అని ప్రశ్నించారు. పెంచిన విద్యుత్, రిజిస్ట్రేషన్ చార్జీలు వెంటనే తగ్గించాలని డిమాండ్ చేశారు.

నిరాశ్రయులకు అన్నదానం



వృద్ధులకు అన్నం వడ్డిస్తున్న మలిరెడ్డి చంద్రశేఖర్ రెడ్డి

కడప(వినాయకనగర్), ఫిబ్రవరి5(ఆంధ్రజ్యోతి): జిల్లా పరిషత్ ప్రాంగణంలోని ప్రేమాలయ నిరాశ్రయుల వసతి గృహంలో బుధవారం టీడీపీ నేతలు, సాయి యువజన సేవా సంఘం చైర్మెన్ మలిరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి తండ్రి సుబ్బారెడ్డి వర్ధంతి సందర్భంగా అన్నదానం ఏర్పాటు చేశారు. పేదల ఆకలి తీర్చడం దేవుడు నాకు కల్పించిన మహాభాగ్యమన్నారు. మలిరెడ్డి క్రిష్టారెడ్డి, శివశంకర్‌రెడ్డి, ముదిరెడ్డి భాస్కర్‌రెడ్డి, సుబ్బరాయుడు, ఎంపీ క్రిష్టారెడ్డి, శివశంకర్, ప్రేమాలయ వసతి గృహ నిర్వాహకులు శ్రీనివాసులరెడ్డి పాల్గొన్నారు.

'అక్రమ అడ్మిషన్లపై చర్యలు తీసుకోవాలి'

పులివెందుల రూరల్, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): అనుమతులు లేకున్నా అడ్మిషన్లు చేస్తున్న ఎడిపై పాఠశాల యాజమాన్యంపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని రివల్యూషనరీ స్టూడెంట్ యూనియన్ (ఆర్‌ఎస్‌యూ) జిల్లా అధ్యక్షుడు ప్రశాంత్ డిమాండ్ చేశారు. బుధవారం పులివెందులలో ఎమ్మెల్సీ రామగోపాల్‌రెడ్డికి వినతిపత్రం సమర్పించిన ఆయన మాట్లాడుతూ చింతకొమ్మదిన్నెలోని పాఠశాల యాజమాన్యం అడ్మిషన్లు నిర్వహిస్తోందన్నారు. ఎంఈఓ వెంకటరామిరెడ్డి రెండు సార్లు అనుమతులు తిరస్కరించినా పాఠశాల యాజమాన్యం అడ్మిషన్లు చేస్తూ అక్రమాలకు పాల్పడుతున్నారని ఆరోపించారు.

'బలిజలకు రిజర్వేషన్‌లు కల్పించకపోతే ఆమరణ దీక్ష'

కడప మారుతీనగర్, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): రాయలసీమలో అత్యంత వెనుకబడిన బలిజలకు ఆర్థిక, సామాజిక, విద్యా, ఉద్యోగ, రాజకీయ పరంగా అభివృద్ధి చెందేలా 5 శాతం రిజర్వేషన్ సౌకర్యాన్ని ఆగస్టు 14లోగా కల్పించాలని సీమ బలిజ సంక్షేమ ఐక్యపోరాట సమితి అధ్యక్షుడు రాము డిమాండ్ చేశారు. లేని పక్షంలో స్వాతంత్ర్యదినోత్సవం రోజైన ఆగస్టు 15న ఆమరణ దీక్ష చేపడతానని స్పష్టం చేశారు. బుధవారం స్థానిక ప్రెస్‌క్లబ్‌లో విలేకరులతో ఆయన మాట్లాడుతూ గతంలో ప్రస్తుత ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు బలిజలకు 5శాతం రిజర్వేషన్ కల్పించేలా చూడాలని కేంద్రానికి నివేదిక పంపించారని గుర్తు చేశారు. సమితి నేతలు భాస్కర్, శ్రీనివాస్, వెంకటేశ్వర్లు, మురళి, తదితరులు పాల్గొన్నారు.

పీఎం వ్యాఖ్యలు గర్హనీయం : తులసిరెడ్డి

వేంపల్లె, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): రాహుల్ గాంధీని అర్బన్ నక్సల్ అని పీఎం మోదీ వ్యాఖ్యానించడం గర్హనీయమని ఏపీసీసీ ముఖ్య అధికార ప్రతినిధి తులసిరెడ్డి అన్నారు. వేంపల్లెలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ దేశ సమైక్యత, సమగ్రత, సార్వభౌమత్వం కోసం ఇందిర, రాజీవ్‌గాంధీ ఆత్మబలిదానం చేశారన్నారు. వారి కుటుంబీకుడు రాహుల్ ప్రధాని పదవిని సైతం త్యాగం చేసిన త్యాగశీలి అన్నారు. బీజేపీ పుట్టకకు ముందే బాక్రానంగల్, నాగార్జున సాగర్ లాంటి భారీ సాగునీటి ప్రాజెక్టులు, దుర్గాపూర్, భిలాయ్, రూర్కెలా వంటి ఉక్కు కర్మాగారాలను కాంగ్రెస్ ప్రభుత్వాలు నిర్మించాయన్నారు.

మరియతల్లి - మార్గదర్శి

లూర్దుమాత నవదిన పూజా ప్రార్థనలో ఫాదర్



ప్రత్యేక అలంకరణలో లూర్దుమాత

కడప కల్చరల్, ఫిబ్రవరి 5, (ఆంధ్రజ్యోతి): దారితెన్నూలేక అలమటిస్తున్న దీనజనులకు మంచి బాట చూపిన మార్గదర్శి మరియతల్లి అని జమ్మలమడుగు విచారణ గురువు ఫాదర్ బడుగు శాంసన్ కొనియాడారు. మరియాపురం లూర్దుమాత తిరుణాళ్లలో భాగంగా చేపట్టే నవదిన ప్రార్థనల్లో నాల్గో రోజు విశ్వాసుల సభనుద్దేశించి ఆయన దైవ సందేశం గావించారు. తల్లి ఆలనా...పాలనకు నోచుకోని పిల్లల జీవితం దుర్భరమన్నారు. లోకరక్షకుడైన యేసు ప్రభువు మన పట్ల దయ, జాలి, కరుణ చూపుతున్నారన్నారు. ఆ తల్లి క్రియలను విశ్వాసులు తప్పక ఆచరించాలన్నారు. మరియతల్లి జీవితాన్ని అనుకరిస్తే ప్రతి ఒక్కరి జీవితాలు ఆనందకరంగా మారగలవన్నారు. కార్యక్రమంలో తొలుత లూర్దుమాత స్వరూపం తేరు, పీఠం అలంకారం గావించారు. ప్రత్యేక పల్లకీలో జపమాలను జపిస్తూ భక్తి గీతాలను గానం చేస్తూ మరియాపురం పురవీధుల్లో ప్రదర్శన గావించారు. తదుపరి దివ్యబలిపూజ ప్రొద్దుటూరు డీన్ గురువులు ఫాదర్ లక్కినేని పీటర్ ప్రభాకర్ గావించారు. కార్యక్రమంలో తిరుణాళ్ల కమిటీ అధ్యక్షుడు జ్యోతి రాయప్ప, వైస్ ప్రెసిడెంట్ బాలశౌరి, కార్యదర్శి పి. ప్రదీప్, సహాయ కార్యదర్శి ఆనంద్, వారాది జోసఫ్, పలువురు విశ్వాసులు, కన్యస్త్రీలు, పాల్గొన్నారు.

'అటెండర్స్‌లా పారామెడికల్స్'



రిమ్స్ ఆవరణలో ఏఐఎస్ఎఫ్ విద్యార్థుల నిరసన

కడప ఎడ్యుకేషన్, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): అటెండర్స్ మాదిరి పారామెడికల్ విద్యార్థులతో పనులు చేయించుకుంటున్నారని ఏఐఎస్ఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి అరుణ్ ఆరోపించారు. బుధవారం కడప రిమ్స్ ఆస్పత్రిని పరిశీలించిన ఆయన మాట్లాడుతూ మెడికల్ కళాశాలలో పారామెడికల్ కోర్సులు డీఎంఎల్‌టీ, డీఎంఐటీ, డీఎంఎస్‌టీ, అనెస్థీషియా, డీఓఎ, డీఆర్‌ఎస్‌టీ, డీఈసీజీ చదువుకునేందుకు వచ్చిన విద్యార్థులు వాళ్ల తీసుకున్న కోర్సుపై ఆస్పత్రిలో ఇంటర్న్‌షిప్ చేయడానికి కొందరు ఉన్నతాధికారులు విద్యార్థులతో పనులను చేస్తున్నారని విద్యార్థులు వాపోయారు. ఆస్పత్రిలో అటెండర్లు చేయవలసిన పనులను చేయిస్తున్నారన్నారు. కళాశాల సమయం దాటినా నైట్ డ్యూటీస్ అంటూ రాత్రి 8గంటల వరకు పనిచేయించుకోవడం, టెక్నీషియన్ల పనులు కూడా విద్యార్థులతోనే చేయిస్తున్నారన్నారు. ఉన్నతాధికారులు విద్యార్థులకు న్యాయం చేయాలని లేకుంటే విద్యార్థులతో కలిపి పోరాటాలు చేస్తామని హెచ్చరించారు. కడప నగర కార్యదర్శి శివతేజ, నేతలు ఈశ్వర్‌రెడ్డి, విద్యార్థులు పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజన కార్మికులకు జీతభత్యాలు పెంచాలి : ఏఐటీయూసీ

కడప సెవెన్ రోడ్స్, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): నగరంలో ఏపీ మధ్యాహ్న భోజన కార్మిక సంఘ ఏఐటీయూసీ అనుబంధం కడప జిల్లా సమితి ఆధ్వర్యంలో మధ్యాహ్న భోజన కార్మికులకు జీతభత్యాలు పెంచాలని డీఈఓ కార్యాలయంలో ఏడీ మునీర్ ఖాన్‌కు వినతిపత్రం సమర్పించారు. ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎల్.నాగసుబ్బారెడ్డి మాట్లాడుతూ మధ్యాహ్న భోజన కార్మికులను కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత రాజకీయ తొలగింపులు ద్వారా భోజనం కార్మికులు దాదాపు 20 ఏళ్లకు పైబడి పనిచేసిన వారిని తొలగించడం వారు కోర్టు ద్వారా ఉత్తర్వులు పొందారన్నారు. ఉత్తర్వులను ఏడీ మునీర్‌ఖాన్‌కు అందజేశామన్నారు.

విద్యార్థికి ఖాసీంఖాన్ ఆర్థిక సహాయం



ఆర్థిక సహాయం అందిస్తున్న ఖాసీంఖాన్

కడప ఎడ్యుకేషన్, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): కడప నగరం రవీంద్రనగర్ వాసి వి.లక్ష్మీదేవి భర్తను కోల్పోయి టైలరింగ్ వృత్తితో దుర్భర జీవితం గడుపుతోంది. ఆమె తన ఇద్దరు కుమారులు యుగంధర్‌రెడ్డి, వి.రాజేష్‌రెడ్డిని సంరక్షిస్తూ వారికి చార్టెడ్ అకౌటెంట్ కోర్సును చదివించడాన్ని గుర్తించిన సీనియర్ ఆడిటర్ లయన్ పి.ఖాసీంఖాన్ వారిని పిలిపించి మూడేళ్లకు సీఏ కోర్సు నిమిత్తం ఏటా రూ.20వేలు చొప్పున మూడేళ్లకు కలిపిరూ.60వేలు ఆర్థికసాయం అందిస్తానని వాగ్దానం చేసి ఇప్పటి వరకు సుమారు రూ.40వేలు అందజేశారు. ఇటువంటి వారిని ఆదరించి ప్రోత్సహిస్తే వారు గొప్ప పౌరులుగా అభివృద్ధి చెందుతారన్నారు. పిల్లల ఆర్థిక పరిస్థితి, తల్లి ఆరోగ్య పరిస్థితి గమనించి వారికి ఆర్థిక సహాయం అందించాలని ఖాసీంఖాన్ కోరారు.

వ్యాసరచన పోటీల్లో ఉష ప్రతిభ

వేంపల్లె, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): జంతు సంక్షేమ సంఘం మండలస్థాయిలో నిర్వహించిన వ్యాసరచన పోటీల్లో ఉషాకిరణ్ పాఠశాలకు విద్యార్థిని పివి ఉష ప్రథమ బహుమతి సాధించినట్లు కరస్పాండెంట్ రమణారెడ్డి తెలిపారు. మండల విద్యావనరుల కేంద్రంలో జరిగిన కార్యక్రమంలో పశుసంవర్థక శాఖ ఉపసంచాలకులు డాక్టర్ కె.మంగేశ్వరరావు విద్యార్థినికి జ్ఞాపిక, ప్రశంసాపత్రాన్ని బహూకరించారు. ఎంఈఓ స్టాలిన్ ఐజాక్, సహాయ సంచాలకులు డాక్టర్ సి.రవీంద్రనాథ్‌రెడ్డి, డాక్టర్ ఎం.సాధిక్ బాష, జంతు సంక్షేమ సంఘం సభ్యులు గోవర్ధన్, సుమన్ పాల్గొన్నారు.

పోస్ట్ మెట్రిక్ స్కాలర్‌షిప్పులు మంజూరు

కడప(వినాయకనగర్), ఫిబ్రవరి5(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని ఎస్సీ విద్యార్థులందరికీ పోస్ట్ మెట్రిక్ స్కాలర్‌షిప్పులు మంజూరైనట్లు సాంఘిక సంక్షేమ సాధికారత అధికారి సరస్వతి తెలిపారు. జిల్లాలోని ఎస్సీ విద్యార్థులందరూ బ్యాంకు ఖాతాలకు ఎన్‌పీసీఐ పోర్టల్‌తో లింకు చేసుకోవాలన్నారు. ఎన్‌పీసీఐ పోర్టల్ లింక్ అయిన బ్యాంకు ఖాతాకు మాత్రమే స్కాలర్‌షిప్‌లు జమ చేస్తారన్నారు. ఎన్‌పీసీఐ లింకు చేసుకోని వారు ఖాతాలకు ఆధార్ నెంబర్ పోర్టల్‌కు లింకు చేయించుకోవాలని కోరారు.

165 రోజుల్లో రీసర్వే పూర్తి

చెన్నూరు, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం చేపట్టిన రీసర్వే మండలంలో 165 రోజుల్లో పూర్తవుతుందని తహసీల్దారు సరస్వతి అన్నారు. చెన్నూరు రెవెన్యూ కార్యాలయంలో బుధవారం తహసీల్దారు మాట్లాడుతూ ప్రస్తుతం కొక్కిరాయపల్లె రెవెన్యూ గ్రామాల్లో 897.26 ఎకరాల్లో సర్వే చేపట్టామన్నారు. రీసర్వే రోజు 1బీ అడంగల్ ఇస్తున్నారని వాటిని తీసుకుని ఇచ్చిన తేదీల్లో పొలాల వద్ద హాజరవాలన్నారు. ఇతర ప్రాంతాల్లో ఉన్న వారికి మరో రోజు గడువు ఇచ్చి రీసర్వే చేపడుతున్నామన్నారు.

అధికారిపై విచారణ జరిపించాలి : పీడీఎస్‌యూ

కడప(వినాయకనగర్), ఫిబ్రవరి5(ఆంధ్రజ్యోతి): జిల్లా వెనుకబడిన సంక్షేమ అధికారి భరత్‌రెడ్డిపై విచారణ జరిపించాలని పీడీఎస్‌యూ నేతలు బుధవారం ఎమ్మెల్సీ రామ్‌గోపాల్‌రెడ్డికి వినతి పత్రం అందజేశారు. రాష్ట్ర ఉపాధ్యక్షుడు అంకన్న మాట్లాడుతూ బాధ్యతలు చేపట్టినప్పటి నుంచీ వసతి గృహం అధికారులతో వేలకు వేలు వసూళ్లు చేస్తున్నారన్నారు.

'అమెండ్‌మెంట్‌ను వ్యతిరేకించాలి'

కడప మారుతీనగర్, ఫిబ్రవరి 5, (ఆంధ్రజ్యోతి): పార్లమెంట్ సమావేశాల్లో ఆమోదానికి రానున్న వక్ఫ్‌బోర్డు అమెండ్‌మెంట్ చట్టానికి వ్యతిరేకంగా మన రాష్ట్ర ఎంపీలు, బీహార్ ఎంపీలు ఓటు వేయాలని సోషియల్ డెమోక్రటిక్ పార్టీ ఆఫ్ ఇండియా (ఎస్‌డీపీఐ) రాష్ట్ర అధ్యక్షుడు అబ్దుల్లాఖాన్, డిమాండ్ చేశారు. స్థానిక సోషియల్ డెమోక్రటిక్ పార్టీ ఆఫ్ ఇండియా జిల్లా కార్యాలయంలో కర్ణాటక ఇన్‌చార్జ్ ఫిరోజ్‌తో కలిసి ఆయన విలేకర్లతో మాట్లాడుతూ వక్ఫ్ ఆస్తులను హస్తగతం చేసుకోవాలనే కుట్రకు తెరతీసే పద్ధతులకు బీజేపీ ప్రభుత్వం స్వస్తిపలకాలన్నారు.

నత్తనడకన నేషనల్ హైవే పనులు

● భూములు కోల్పోయిన వారికి నష్టపరిహారం ఇవ్వని అధికారులు ● పనులు మాత్రం ప్రారంభం

జమ్మలమడుగు, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): జమ్మలమడుగులో నేషనల్ హైవే పనులు నత్తనడకన సాగుతున్నాయి. కోవెలకుంట్ల ప్రాంతం నుంచి జమ్మలమడుగు మీదుగా ముద్దనూరు, హైవే పనులు ప్రారంభం అయ్యాయి. అయితే అధికారులు అన్ని ప్రాంతాల్లో పరిశీలన చేసి స్థలాలు, పొలాలు గుర్తించి వారికి సంబంధించిన నష్టపరిహారాన్ని ఇచ్చేందుకు బిల్లులు జిల్లా అధికారులకు అందజేసినట్లుగా తెలుస్తోంది. అందులో భాగంగా జమ్మలమడుగు మండలం ప్రొద్దుటూరు రోడ్డులో బైపాస్ సర్కిల్ సమీపం నుంచి ముద్దనూరు వైపు నేషనల్ హైవే పనులు చేసేందుకు నెలన్నర నుంచి చెట్లు కొట్టడం, తదితర పనులు ప్రారంభించారు. అయితే కొంతమందికి మాత్రమే పరిహారం వచ్చినట్లుగా సమాచారం. చాలా మందికి పొలాలు,స్థలాలకు సంబంధించి ఇంతవరకు డబ్బులు రాలేదని వాపోతున్నారు. అధికారులైతే హైవే భూసేకరణ వేగవంతం చేశారని, రహదారులకు సంబంధించి బైపాస్ రోడ్డుకు ఇరువైపుల పొలాలు, స్థలాలు నష్టపోయినవారికి ఇంతవరకు డబ్బులు అందించలేదని కొందరు బాధితులు తహసీల్దారు, ఆర్డీవో కార్యాలయం చుట్టూ తిరుగుతున్నారు. అలాగే ప్రస్తుతం పెన్నానది పరిసర ప్రాంతంలో పనులు నత్తనడకన సాగుతున్నాయని, అక్కడి నుంచి జగనన్న కాలనీ మీదుగా అంబవరం గ్రామ ప్రాంతంలో కొందరు బాధితులకు నష్టపరిహారం అందిందని ఇంకా డబ్బులు రావాలని ఎదురుచూస్తున్నారు. అలాగే అంబవరం గ్రామం వద్ద నుంచి ముద్దనూరు వైపు వెళ్లే బైపాస్ రోడ్డుకు నేషనల్ హైవే అధికారుల వలన కొందరు ప్రజలు డబ్బులు రాక స్థలాలు, పొలాలు పోయి ఇబ్బంది పడుతున్నట్లు వాపోయారు. పనులు మాత్రం అంతంతమాత్రంగానే జరుగుతున్నాయని, ప్రతిరోజు జగనన్న కాలనీలో ఇతర పొలాల రైతులు డబ్బులకోసం ఆర్డీవో కార్యాలయం చుట్టూ తిరుగుతున్నారు. వారం క్రితం నేషనల్ హైవే అధికారులు జిల్లా అధికారులకు బాధితుల నష్టపరిహారం త్వరగా బిల్లులు అందించే విధంగా చర్యలు తీసుకోవాలని చెప్పారు.

● ఆర్డీవోను కలిసిన నేషనల్ హైవే అధికారులు

జమ్మలమడుగులో బుధవారం ఆర్డీవో సాయిశ్రీ నేషనల్ హైవే జిల్లా ఎగ్జిక్యూటివ్ ఇంజనీరు భాస్కర్‌రెడ్డి వారి సిబ్బంది ఆర్డీవో కార్యాలయంలో సమావేశం అయినట్లుగా తెలిసింది. నేషనల్ హైవే సంబంధించిన సమస్యలపై వివరించినట్లుగా సమాచారం. ప్రధానంగా ముద్దనూరు మండలంలోని కమ్మవారిపల్లెకు చెందిన ప్రాంతంలో సమస్యలపై ఆరా తీసినట్లుగా తెలిసింది. ఈ సమావేశంలో టీడీపీ నాయకులు సీఎం సురేశ్‌నాయుడు, నేషనల్ హైవే అధికారులు పాల్గొన్నారు.





జమ్మలమడుగు ప్రొద్దుటూరు రోడ్డులో బైపాస్ సమీపాన ఏర్పాటు చేస్తున్న హైవే, ప్రొద్దుటూరు రోడ్డులో హైవే రోడ్డు కోసం చెట్లను తొలగిస్తున్న ఎక్స్‌కవేటర్

గుండె జబ్బులపై అవగాహన

జమ్మలమడుగు, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): జమ్మలమడుగులోని కన్నెలూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో బుధవారం గుండె జబ్బులపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమం రాష్ట్ర ప్రభుత్వం స్టెమీ కార్యక్రమాన్ని రాష్ట్ర వ్యాప్తంగా గత సంవత్సరం నుంచి ప్రారంభించినట్లుగా వారు తెలిపారు. దీంతో అనేకమంది హృదయ వ్యాధిగ్రస్థులు ప్రయోజనం పొందుతున్నారన్నారు. గతంలో ప్రజల్లో అవగాహన లేక అనేక మంది మరణాలు సంభవించాయన్నారు. ప్రస్తుతం ప్రభుత్వం రూ.45 వేలు విలువైన ఒక ఇంజక్షన్ పూర్తిగా ఉచితంగా ప్రతి ఏరియా ఆస్పత్రిలో అందుబాటులో ఉంచిందన్నారు.ఏఎన్ఎంలు, ఆశావర్కర్లు వారి వారి ప్రాంతాలకు వెళ్లి ప్రజలకు తెలియజేయాలన్నారు. గుండె సంబంధిత వ్యాధిగ్రస్థులను జమ్మలమడుగు ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకెళ్లి వైద్యసేవలు అందేవిధంగా వారు కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ తాహిరా, ఆశా వర్కర్లు, ఏఎన్ఎం సిబ్బంది పాల్గొన్నారు.

కార్మికుల సమస్యలను పరిష్కరించాలి

ప్రొద్దుటూరు టౌన్, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం కార్మికుల సమస్యలను పరిష్కరించాలని ఏపీ ఆటోడ్రైవర్స్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో బుధవారం తహసీల్దారు గంగయ్యకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఫెడరేషన్ జిల్లా అధ్యక్షుడు హరి మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన నాలుగు కార్మిక చట్టాలను రద్దు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ యూనియన్ కార్యదర్శి మధు, భవన నిర్మాణ కార్మిక సంఘం ఏరియా కార్యదర్శి యేసోబు, కుమార్ పాల్గొన్నారు.

'మున్సిపల్ సాధారణ సమావేశం వాయిదాకు సరైన కారణం లేదు'

ప్రొద్దుటూరు, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి) మున్సిపల్ బడ్జెట్ సమావేశం, సాధారణ సమావేశంలో రెండు అజెండాలు రూపొందించిన చైర్‌పర్సన్ భీమునిపల్లె లక్ష్మీదేవి కేవలం బడ్జెట్ సమావేశం జరిపి సాధారణ సమావేశం జరపకపోవడానికి ఆమె సరైన కారణాలు వెల్లడించలేదని మున్సిపల్ మాజీ ఇన్‌చార్జ్ చైర్మన్, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి వీఎస్ ముక్తియార్ తెలిపారు. బుధవారం స్థానిక ఇస్లాంపురం వీధిలోని ఆయన స్వగృహంలో విలేకరులతో మాట్లాడుతూ సాధారణ సమావేశం జరపకపోవడానికి మున్సిపల్ చైర్‌పర్సన్ లక్ష్మీదేవి సరైన కారణం తెలపకుండా అర్థాంతరంగా సభవాయిదా వేయడంతోనే టీడీపీ కౌన్సిలర్లు సాధారణ సమావేశాన్ని చట్టబద్ధంగా నడిపి సాధారణ సమావేశం అజెండాను ఆమోదించారన్నారు. అజెండా పెట్టింది మీరే వాయిదా వేసింది మీరే అన్నారు. సమావేశంలో టీడీపీ నాయకుడు ఖలీల్ జనసేన నాయకుడు జిలాన్ లు పాల్గొన్నారు.

మండల సమావేశం వాయిదా

బి.కోడూరు, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): బి.కోడూరు మండలం సర్వసభ్య సమా వేశం 5న బుధవారం జరగాల్సి ఉండగా, కొన్ని అనివార్య కారణాల వల్ల వాయిదా వేసినట్లు ఎంపీడీవో భాస్కర్‌రావు తెలి పారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లోక్‌సభ జరుగుతున్నందున బుధవారం జరగాల్సిన మండల సమాశాన్ని తిరిగి 9వతేదీ జరగనున్నట్లు ఆయన తెలిపారు. ఈ విషయం అధికారులు గమనించాలని తెలిపారు.

ఘనంగా అభయాంజనేయస్వామి వార్షికోత్సవం

కొండాపురం, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చౌటిపల్లె గ్రామంలో వెలసిన అభయాంజనేయస్వామి ఆలయ వార్షికోత్సవాన్ని బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

మద్యం సీసాలు స్వాధీనం

దువ్వూరు, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): దువ్వూరు మండలం సంజీవరెడ్డిపల్లె సమీపంలో బెల్టుషాపు కోసం తీసుకెళుతున్న పది మద్యం బాటిళ్లను బుధవారం స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ వినోద్‌కుమార్ తెలిపారు. బాటిళ్లతోపాటు బెల్టుషాపు నిర్వాహకుడు నాగేశ్వరరెడ్డిని అదుపులోకి తీసుకున్నట్లు పేర్కొన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ వివరించారు.

శనగలో పంట కోత ప్రయోగాలు

మైలవరం, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కల్లుట్ల పంచాయతీలో బుధవారం వ్యవసాయాధికారులు పంట కోత ప్రయోగాలు నిర్వహించారు. గ్రామంలో పొలం పిలుస్తోంది కార్యక్రమంలో శనగ పంటలో 5ఇన్‌టు 5 మీటర్ల కొలతలో పంట కోత కోయించి నూర్పిడి చేశారు. అనంతరం శనగ పంట దిగుబడులను అంచనా వేశారు. పంటకోత ప్రయోగాన్ని రైతుల సమక్షంలో ఎంపిక ప్లాట్లలో కోత కోయించి నూర్పిడి చేయించి దిగుబడులను అంచనా వేశారు. ఈ కార్యక్రమంలో ఇన్సూరెన్స్ కంపెనీ ప్రతినిధులు, వ్యవసాయ శాఖ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

గోదాములో రేషన్ బియ్యం స్టాకు పరిశీలన

ప్రొద్దుటూరు,ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ గోదాములో రేషన్ బియ్యం స్టాకును ఆర్డీవో సాయిశ్రీ తనిఖీ చేశారు. బుధవారం ఆమె జమ్మలమడుగు రోడ్డులోని ప్రభుత్వ గోదాములో స్టాక్ రిజిస్టర్లు ఏవని ప్రశ్నించారు. గోడౌన్ డిప్యూటీ తహసీల్దారు లింగస్వామి కడపకు రీకలెక్షన్‌కు వెళ్లారని అందువల్ల రికార్డులు అందుబాటులో లేవని సివిల్ సప్లయ్ డీటీ మల్లికార్జున తెలిపారు. దీంతో ఆర్డీవో జమ్మలమడుగుకు రికార్డులను తీసుకురావాలని ఆదేశించారు. ఈ తనిఖీల్లో డిప్యూటీ తహసీల్దారు సాయినాథ్‌రెడ్డి, ఆర్ఐ నాగమోహన్‌రెడ్డి పాల్గొన్నారు.

గంబూషియా చేపలు విడుదల

ప్రొద్దుటూరు రూరల్, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): దోమలు వృద్ధి చెందకుండా లార్వా దశలోనే నిర్మూలించేందుకు నీటికుంటల్లో గంబూషియా చేపలను వైద్యాధికారులు విడుదల చేశారు. బుధవారం మండల పరిధిలోని అమృతానగర్, చెన్నమరాజుపల్లె, కామనూరు, గోపవరం, నరసింహాపురం, కాకిరేణిపల్లెల్లో ఉన్న నీటి కుంటలు, కోనేరుల్లో ఈ చేపలను వదిలారు. కార్యక్రమంలో వైద్యాధికారి డాక్టర్ హనీఫ్‌బాబా, మలేరియా సబ్‌యూనిట్ అధికారి ఇన్‌చార్జి మురళీధర్, హెల్త్ సూపర్‌వైజర్ బి.ఎ.వరప్రసాద్, మాధవరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

రతనాల వేంకటేశ్వరస్వామికి ప్రత్యేక పూజలు

ప్రొద్దుటూరు టౌన్, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): పాత మార్కెట్‌లోని లలితాదేవి, రతనాల వేంకటేశ్వరస్వామి ఆలయంలో స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. బుధవారం ఉదయం రతనాల వేంకటేశ్వరస్వామికి, స్వామివారి చెల్లెలు లలితాదేవి అమ్మవారికి విశేష పూజలు, అభిషేకాలు, అర్చనలు నిర్వహించి సుందరంగా అలంకరించారు. స్వామివారికి ప్రత్యేకంగా 1008 కలువపూలతో అలంకరించారు. భక్తులు పెద్ద సంఖ్యలో స్వామివారిని దర్శించుకున్నారు.

జంప్‌రోప్‌లో విద్యార్థుల ప్రతిభ

మైదుకూరు రూరల్ ,ఫిబ్రవరి 5(ఆంధ్రజ్యోతి) : ఇంటర్ డిస్ట్రిక్ జంప్ రోప్ చాంపియన్ షిప్ కాంపిటీషన్‌లో మైదుకూరు హైస్కూల్ విద్యార్థులు ప్రతిభ చూపి ఒవర్‌ఆల్ చాంపియన్ షిప్ గెలుపొందారని హైస్కూల్ ప్రధానోపాధ్యాయుడు రామ్మోహన్ విలేకరుల సమావేశంలో తెలిపారు. మేధా డిఫెన్స్ అకాడమీలో ఇంటర్ డిస్ట్రిక్ జంప్ రోప్ చాంపియన్ షిప్ కాంపిటీషన్ జరిగింది.ఈ కాంపిటీషన్‌లో హైస్కూల్ విద్యార్థులు ప్రతిభ చూపి పతకాలను సొంతం చేసుకున్నారు. ఫిజికల్ డైరెక్టర్ వినోనియార్,చంద్రావతి విద్యార్థులకు అభినందనలు తెలిపారు.

గుప్త నిధుల పేర బురిడీ

ఏడుగురు అరెస్టు

ప్రొద్దుటూరు , ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి) : గుప్త నిధులు వెలికి తీస్తామని చెప్పి బురిడీ కొట్టించిన మోసగాళ్ల ముఠాను ప్రొద్దుటూరు ఒన్‌టౌన్ పోలీసులు బుధవారం పట్టుకున్నారు.. వివరాల్లోకి వెళితే... ఆర్టీపీపీకి చెందిన రాజసాగర్ అనే ఉద్యోగికి గుప్త నిధుల మీద వ్యామోహంతో వాటిని తీసే ముఠాను ఆశ్రయించాడు. ఆ ముఠా గుప్త నిధులు వెలికి తీస్తామని చెప్పి మూడు లక్షలు వసూలు చేసింది. ఆ ముఠా తామే ముందుగా ఓప్రదేశంలో విగ్రహాలను పాతిపెట్టి వారి సమక్షంలో పూజలు చేసి దాచిన విగ్రహాలను వెలికి తీసి వాటిని గుప్త నిధులుగా ఇచ్చారు. నిధులు వస్తాయనుకుంటే ఏదో విగ్రహం బయటికి రావడమేమిటని సందేహపడ్డాడు. ఆలస్యంగా తాను మోసపోయానని గ్రహించి రాజసాగర్ కంగుతిని పోలీసులకు సమాచారం ఇవ్వడంతో ఆ ముఠా గుట్టును రట్టు చేశాడు. ఈ గుప్త నిధుల ముఠాను ఒన్‌టౌన్ సీఐ రామక్రిష్టారెడ్డి నేతృత్వంలో అరెస్టు చేశారు. అరెస్టు అయిన వారిలో కడప అశోక్‌నగర్‌కు చెందిన ఎర్రసానిశ్రీనివాసులు (49), వల్లూరు మండలం కొప్పోలు గ్రామం దళితవాడకు చెందిన నారిగాండ్ల లక్ష్మీనారాయణ (48), ఎర్రగుంట్ల మండలం శాంతినగర్‌కు చెందిన షేక్ చాంద్‌బాషా(42), ఎర్రగుంట్ల మండలం శ్రీరాముల పేటకు చెందిన మల్లు వెంకట రెడ్డి (50), ఎర్రగుంట్ల టౌన్‌కు చెందిన ఆలూరు బాల సంజీవరాయుడు అలియాస్ చిన్న (48), ప్రొద్దుటూరు టౌన్ శ్రీరాంనగర్‌కు చెందిన కుంటుమల్ల మునికుమార్ (47) ఎర్రగుంట్ల మండలం చిలమకూరుకు చెందిన దియ్యా మధుబాబు(47) లు వున్నారు. వీరితో పాటు ఒక నల్లటి మెటల్ విగ్రహం, 29 రంగురాళ్లు, 8మొబైల్స్ , కారు, మోటార్ సైకిల్ స్వాధీనం చేసుకున్నారు. రాజసాగర్ఇచ్చిన ఫిర్యాదు మేరకు వీరిపై కేసు నమోదు చేసి అరెస్టు చేశారు.

లీకేజీ గుంతతో పొంచి ఉన్న ప్రమాదం



ప్రమాదకరంగా లీకేజీ గుంత

జమ్మలమడుగు, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): జమ్మలమడుగులోని నారాపురం వేంకటేశ్వరస్వామి ఆలయానికి ఎదురుగా ప్రధాన రోడ్డు పక్కన పైపు లీకేజీ గుంత ఏర్పడింది. ఉదయం, సాయంత్రం నీళ్ల సరఫరా సమయంలో పైపుల లీకేజీతో గుంత నిండుతోంది. ఈ సమస్య పది రోజుల నుంచి ఉంది. రాత్రి సమయాల్లో ఆదారిన వెళ్లే ద్విచక్ర వాహనదారులు ప్రమాదానికి గురయ్యే అవకాశం ఉంది. చుట్టూ పాఠశాలలు ఉండడం వలన ఆలయం ఎదురుగా పైపులు లీకేజీ అయిన గుంత ప్రమాదకరంగా మారిందని ఆ ప్రాంతవాసులు తెలిపారు. మున్సిపల్ నీటిపారుదల శాఖ సిబ్బంది, అధికారులు వెంటనే చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

ఎట్టకేలకు రోడ్డు పనులు ప్రారంభం



దెబ్బతిన్న రోడ్డు పనులు మొదలుపెట్టిన దృశ్యం

రాజుపాలెం, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని టంగుటూరు గ్రామం వద్ద మంగళవారం రోడ్డు పనులు ప్రారంభించారు. ఎన్నికల హామీల్లో భాగంగా ప్రొద్దుటూరు ఎమ్మెల్యే నంద్యాల వరదరాజులరెడ్డికి ప్రజలంతా రోడ్డు వేయాలని కోరడంతో అధికారంలోకి వచ్చి ఆరునెలల్లో రోడ్డు పనులు పూర్తి చేస్తామన్న హామీతో రోడ్డు పనులు ప్రారంభించారు. వర్షాకాలంలో స్కూటరిస్టులు కింద పడడంతో పాటు కొందరికి కాళ్లు, చేతులు విరిగిన రోజులున్నాయి. ఆర్‌అండ్‌బి ద్వారా కోటి 70లక్షలు మంజూరు చేసి రోడ్డు పనులు మొదలుపెట్టించారు.

భూ సమస్యలను త్వరగా పరిష్కరించాలి



రికార్డులను పరిశీలిస్తున్న సాయిశ్రీ

చాపాడు, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): ఇటీవల రెవెన్యూ సదస్సుల్లో రైతుల భూ సమస్యలను త్వరగా పరిష్కారం చేయాలని జమ్మలమడుగు ఆర్డీవో సాయిశ్రీ తహసీల్దారు రమాకుమారిని ఆదేశించారు. బుధవారం సాయంత్రం ఆర్డీవో తహసీల్దారు కార్యాలయాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. కార్యాలయంలోని రికార్డులను ఆమె పరిశీలించారు. మండలంలో జరుగుతున్న భూముల రీ సర్వే పురోగతిపై ఆర్డీవో తహసీల్దారును అడిగి తెలుసుకున్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడికి గాయాలు

కొండాపురం, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): స్థానిక నేషనల్ హైవేపై బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో యువకునికి గాయాలయ్యాయి. మండలంలోని తిమ్మాపురం గ్రామానికి చెందిన వల్లూరు శివశంకర్‌రెడ్డి అనే యువకుడు కొండాపురం సీఎంఆర్ కాంప్లెక్ సమీపంలో బైక్ క్రాస్ చేస్తుండగా, ఎదురుగా తాడిపత్రి వైపు వెళుతున్న కారు ఢీకొంది. ఈ సంఘటనలో శివశంకర్‌రెడ్డికి తీవ్రగాయాలు కాగా అతనిని తాడిపత్రి ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అక్కడి నుంచి మెరుగైన చికిత్సకోసం అనంతపురం సవేరా ఆసుపత్రికి తరలించారు.

స్టైఫండ్ పెంచాలని పశువైద్య విద్యార్థుల ర్యాలీ

ప్రొద్దుటూరు అర్బన్, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి) : స్టైఫండ్ పెంచాలని శ్రీ వెంకటేశ్వర పశువైద్య విశ్వ విద్యాలయం విద్యార్థులు తరగతులను బహిష్కరించి స్థానిక ఎస్ ఎస్ మాల్ నుంచి శివాలయం సర్కిల్ వరకు నిరసన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 2 ఏళ్ళుగా ఉన్న ఉపకార వేతనం సమస్యను పరిష్కరించాలని సమ్మె నోటీసును కాలేజీ అసోసియేట్ డీన్ డాక్టర్ శ్రీనివాస ప్రసాద్ కు అందించి నిరసన వ్యక్తం చేశామన్నారు.



వేసవిలో తాగునీటి సమస్య లేకుండా చూస్తాం

ఓబన్న, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ



ముఖాముఖి

పోరుమామిళ్ల, ఫిబ్రవరి 5 (ఆంధ్ర జ్యోతి): వేసవిలో మండలంలోని ఏ గ్రామంలో కూడా తాగునీటి సమస్య తలెత్తకుండా ముందు జాగ్రత్త చర్యలు తీసుకుంటామని ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ ఓబన్న అన్నారు. ఆయన ఆంధ్రజ్యోతికి ఇచ్చిన ఇంటర్వ్యూ లో ఆయతాగునీటి సమస్యపై ఆయన మాట్లాడారు.

ప్రశ్న: మండలంలో ఎన్ని గ్రామాలున్నాయి

జవాబు: 85 గ్రామాలు.

ప్రశ్న: మండలంలో ఎన్ని ఓవర్‌హెడ్ ట్యాంకులు,ఎన్ని డైరెక్టు పంపింగ్ స్కీంలు ఉన్నాయి

జవాబు: 34 ఓవర్‌హెడ్ ట్యాంకులు 215 డైరెక్టు పంపింగ్ స్కీంలున్నాయి.

ప్రశ్న: మండలంలో చేతిబోర్లు ఎన్ని ఉన్నాయి, ఎన్ని పనిచేస్తున్నాయి

జవాబు: మండలంలో 65 చేతిబోర్లు ఉన్నాయి. అందులో 40 పనిచేస్తున్నాయి.

ప్రశ్న: వేసవిలో తాగునీటి సమస్య ఏర్పడే గ్రామాలు ముందుగా గుర్తించారా.

జవాబు: తాగునీటి సమస్య తలెత్తకుండా ప్రభుత్వానికి ముందుగా ప్రతిపాదనలు పంపాం. పోరుమామిళ్ల, కప్పలపల్లె, సిద్దవరం, వెంకటాపురం, కవలకుంట్ల గ్రామాలను గుర్తించి ముందుగానే ప్రతిపాదనలు పంపాం.

ప్రశ్న: ఒకవేళ తాగునీటి సమస్యలు ఏర్పడితే ఎలాంటి చర్యలు తీసుకుంటారు?

జవాబు: తాగునీరు సమస్యలు ఎక్కువగా ఉన్న గ్రామాల్లో ట్యాంకర్లతో నీటి సరఫరా చేసేందుకు ప్రభుత్వం అనుమతి కోరాం.

ప్రశ్న: మండలంలో శానిటేషన్ చేస్తున్నారా?

జవాబు: చేయిస్తున్నాం.

ప్రశ్న: పుల్లీడు నుంచి పోరుమామిళ్లకు గతంలో పైపులైను వేశారు కదా. ప్రస్తుతం దెబ్బతింది దాని పరిస్థితి ఏంటి?

జవాబు: పుల్లీడు నుంచి పోరుమామిళ్లకు రోడ్డు విస్తరణ పనుల్లో పైపులు దెబ్బతిన్నాయి. రూ.50లక్షల రూపాయలు నష్టం వాటిల్లింది. వాటికి అంచనా వేసి సంబంధిత అధికారులకు నివేదిక పంపాం.

8న విగ్రహాల ప్రతిష్ఠ

చాపాడు, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నక్కలదిన్నె గ్రామంలో నూతనంగా నిర్మించిన రామాలయంలో దేవతా మూర్తులు అయిన సీతా, రామ, లక్ష్మణ విగ్రహాలను 8న శనివారం ఉదయం ఘనంగా ప్రతిష్ఠ చేస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ దేవాలయాన్ని సుమారు రూ.70 లక్షలతో నిర్మించారు. 6వ తేదీ గురువారం హోమం,7న శుక్రవారం విగ్రహాల ఊరేగింపు జరుపుతున్నారు. కోలాటం, నృత్య ప్రదర్శన, రెండు మహిళా గ్రూపులతో నిర్వహించనున్నట్లు తెలిపారు. శనివారం సీతారాముల కల్యాణం నిర్వహించనున్నారు. భక్తులకు మధ్యాహ్నం అన్నదానం చేస్తున్నట్లు వారు పేర్కొన్నారు.


వాహనాల తనిఖీ

అట్లూరు, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి) : బద్వేలు - కడప ప్రధాన రహదారి నందు రెడ్డిపల్లె క్రాస్ రోడ్డు వద్ద వాహనాలకు రికార్డులు, డ్రైవింగ్‌లైసెన్సు, హెల్మెట్లు లేని వాహనదారులకు బుధవారం తనిఖీ నిర్వహించి 12 వాహనాలకు రూ.4వేలు జరిమానాలు వేసినట్లు అట్లూరు ఎస్ఐ రామక్రిష్ణ తెలిపారు. ప్రమాదాలపై సూచనలు సలహాలు ఇచ్చారు. కార్యక్రమంలో పోలీసు సిబ్బంది బాస్కర్, చంద్రశేఖర్ పాల్గొన్నారు.

సహకారసంఘాలకు విచారణ అధికారుల నియామకం

బద్వేలుటౌన్, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి) : బద్వేలు నియోజకవర్గంలోని చిన్నకేశంపల్లె, బ్రాహ్మణపల్లె, బి.కోడూరు, కొత్తపేట, నర్సాపురం సహకార సంఘాలకు కలెక్టర్, సహకారశాఖ అధికారి ఆదేశాల మేరకు 5 గురు విచారణ అధికారులను నియమించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా సహకారసంఘం అధికారులు నాగమణి, రహమత్, ఆనంద్‌కుమార్, వెంకటరమణ, ఈశ్వరయ్య ఎన్నిక కావడం జరిగిందన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పది సంవత్సరాలుగా సంఘంలో జరిగే కార్యకలాపాల గురించి తమను విచారణ అధికారులుగా ఉన్నతాధికారులు ఆదేశించారని తెలిపారు.

సీఎంను కలిసిన మాజీ ఎమ్మెల్సీ బచ్చల పుల్లయ్య



ప్రొద్దుటూరు, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి) : ఉత్తరాంధ్ర లో ఎమ్మెల్సీ ఎన్నికల సందర్భం గా మాజీ ఎమ్మెల్సీ డాక్టర్ బచ్చల పుల్లయ్యను పార్టీ పరిశీలకుడిగా నియమించింది. ఈ నేపథ్యంలో ఎన్నికల సందర్భంగా సీఎం చంద్రబాబును విజయవాడలో మాజీ ఎమ్మెల్సీ బచ్చల పుల్లయ్య కలిశారు. ఎన్నికల పరిస్థితి పై చర్చించారు.